





జిల్లాలో తెలుగుదేశం పార్టీ దూకుడు పెంచింది. ఎన్నికల క్షేత్రంలో విజయాన్ని కైవసం చేసుకోనేందుకు వ్యూహం సిద్ధం చేసుకుంటోంది. వైసీపీలో గందరగోళం నెలకొంది. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై పార్టీలోని నేతలే తిరుగుబాటు చేస్తున్నారు. ఎమ్మెల్యేలకు తిరిగి టిక్కెట్‌లు ఇవ్వొద్దంటూ బహిరంగంగానే ఉద్యమిస్తున్నారు. వివిధ నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితులు మాత్రం కుదటపడలేదు. దీనికి తోడు రానున్న రోజుల్లో వైసీపీకి మరికొన్ని షాక్‌లు తగిలే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పార్టీ అభ్యర్థులను ఎంపిక చేయడంలో కూడా టీడీపీ ముందుండగా వైసీపీ టిక్కెట్‌లు ప్రకటించడంలో వెనుకబడింది.



టీడీపీ దూకుడు

- కొన్ని స్థానాల్లో టీడీపీకి అభ్యర్థులపై పూర్తి స్పష్టత
- అభ్యర్థులను ప్రకటించడమే తరువాయి..
- వైసీపీలో గందరగోళం
- ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నేతలే తిరుగుబాటు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు, లోక్‌సభకు తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను దాదాపు ఖరారు చేయనున్నారు. టీడీపీలో చేరనున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను నరసరావుపేట ఎంపీ స్థానానికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులును వినుకొండ ఎమ్మెల్యే బరిలోకి, గురజాల అసెంబ్లీకి యరపతినేని శ్రీనివాసరావును, చిలకలూరిపేట స్థానానికి మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావును, సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను, మాచర్ల అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డిని బరిలోకి దించనున్నారు. వారి పేర్లను అధిష్టానం ప్రకటించడమే తరువాయి.

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన వెంట వైసీపీకి చెందిన పలువురు ముఖ్యనేతలు కూడా టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు వినుకొండ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో ఓటమి చెందిన జీవీ వరుసగా నాలుగోసారి వినుకొండ బరిలో దిగుతున్నారు. గురజాల అసెంబ్లీకి యరపతినేని శ్రీనివాసరావు వరుసగా ఏడోసారి పోటీ చేయనున్నారు. 1994 నుంచి ఆరుసార్లు యరపతినేని గురజాల నుంచి పోటీ చేయగా మూడుసార్లు విజయం సాధించారు. విజయం సాధించేందుకు యరపతినేని వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేటలో పోటీకి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. చిలకలూరిపేట నుంచి వరుసగా ఆరవసారి పుల్లారావు పోటీ చేస్తున్నారు. గతంలో ఐదుసార్లు పోటీ చేయగా మూడుసార్లు విజయం సాధించారు. మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ గతంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన తొలిసారి సత్తెనపల్లి నుంచి బరిలో దిగుతున్నారు. 1989 నుంచి వరుసగా నాలుగు సార్లు పెదకూరపాడు నుంచి, 2009లో గుంటూరు పశ్చిమ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మాచర్ల నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి మూడవసారి పోటీ చేస్తున్నారు. గతంలో 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. 1999లో బ్రహ్మారెడ్డి తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మాచర్లలో గెలిచి తెలుగుదేశం జెండా ఎగురవేయాలన్న దృఢ సంకల్పంతో ఎన్నికల బరిలో బ్రహ్మారెడ్డి దూసుకుపోతున్నారు. మాచర్లలో అధికారం అండతో జరుగుతున్న అరాచకాలను అడ్డుకుంటూ పార్టీ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. మాచర్లలో ఎమ్మెల్యేపై ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు వ్యూహాత్మకంగా జూలకంటి వ్యవహరిస్తున్నారు. నరసరావుపేట, పెదకూరపాడు నియోజకవర్గాలకు సంబంధించి ఒక్కో నియోజకవర్గంలో ముగ్గురు పేర్లను అధిష్టానం పరిశీలనలోకి తీసుకుంది. నరసరావుపేట నుంచి ఇన్‌ఛార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రామచంద్రప్రసాద్, పెదకూరపాడు నుంచి మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, భాష్యం ప్రవీణ్ పేర్లు పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది.

వైసీపీలో వర్గపోరు..

తెలుగుదేశం పార్టీ ఎన్నికల క్షేత్రంలో దూసుకుపోతుంటే వైసీపీలో మాత్రం ఆ పరిస్థితి కానరావడంలేదు. కొంతమంది ఎమ్మెల్యేలను వ్యతిరేకిస్తున్న క్యాడర్ వారికి వ్యతిరేకంగా పని చేస్తోంది. దీనిని ఎమ్మెల్యేలు జీర్ణించు కోలేకపోతున్నారు. నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థిగా నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేరును, చిలకలూరిపేట అసెంబ్లీకి మల్లెల రాజేష్‌నాయుడు పేరును అధిష్టానం ప్రకటించింది. ఎమ్మెల్యే విడదల రజనిపై నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ఆమెను గుంటూరు పశ్చిమకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆరు నియోజకవర్గాలకు సంబంధించి పార్టీ అభ్యర్థుల పేర్లను అధికారికంగా అధిష్టానం ప్రకటించలేదు. అయితే తాడేపల్లి ప్యాలెస్‌లోని పార్టీ పెద్దలు నరసరావుపేట నుంచి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల నుంచి కాసు మహేష్‌రెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు. మాచర్ల మినహా మిగతా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను పార్టీలోని ముఖ్యులు తీవ్రంగా వ్యతికిస్తున్నారు. ఈ మేరకు నియోజకవర్గాల్లో సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి గురజాల ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిపై నిప్పులు చెరుగుతున్నారు. ఆయన పిడుగురాళ్లలో ఆత్మీయ సమావేశం కూడా నిర్వహించి ఎమ్మెల్యేపై విమర్శలు చేశారు. జంగా పార్టీ వీడతారన్న టాక్ కూడా ఉంది. వినుకొండలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసీపీని వీడారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో పొసగకనే ఆయన పార్టీ నుంచి బయటకు వెళ్లారు. బొల్లాకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో తన వర్గాన్ని కూడగడుతున్నారు. మక్కెన టీడీపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు, పెదకూరపాడులో నంబూరు శంకరరావులపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పార్టీ నేతలు వారిపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మొత్తం మీద వైసీపీలో నలుగురు ఎమ్మెల్యేలకు తిరిగి టిక్కెట్‌లు ఇవ్వొద్దన్న ఉద్యమాన్ని నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్ నిర్వహిస్తోంది. తమ వాదనను ఇప్పటికే పార్టీలోని పెద్దలకు వినిపించారు. తాడేపల్లి పార్టీ కార్యాలయం వద్ద ఆందోళనలు నిర్వహించిన విషయం తెలిసిందే. నియోజకవర్గాల్లో నెలకొన్న అసమ్మతి పలువురు ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. ఒకరిద్దరు ఎమ్మెల్యేలకు తిరిగి పార్టీ టిక్కెట్ దక్కదన్న ప్రచారం జరుగుతోంది.

ఆసరా.. అంతేనా?

- బటన్ నొక్కి రెండువారాలైనా ఊసేలేదు
- ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన
- రుణమాఫీ కోసం 7 లక్షల మంది ఎదురుచూపు
- ఈ నెల 15 తర్వాత అంటుండటంతో లబ్ధిదారుల్లో గుబులు

బటన్లు నొక్కుతున్నా.. లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులకు సంక్షేమ నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే వేస్తున్నా.. అని ప్రతీ వేదికపై నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రకటిస్తుంటారు. అయితే ఆయన బటన్లు నొక్కడం వరకే పరిమితమవుతున్నారు. ఆ బటన్లు నొక్కినా లబ్ధిదారులకు ఆయా పథకాల నగదు అందుతుందా లేదా అని చూడటంలేదు. లబ్ధిదారులు ఏమో ముఖ్యమంత్రి బటన్ నొక్కాడు ఇక తమ ఖాతాల్లో నగదు పడుతుందని ఎదురు చూసిచూసీ అలసిపోతున్నారు. బటన్లు నొక్కినా పనైపోయిందని ముఖ్యమంత్రి చేతులు దులుపు కుంటున్నారు. ఈ కోవలోకే ఆసరా పథకం చేరింది. నాలుగో విడత ఆసరా పథకం బటన్ నొక్కి ఇప్పటికి రెండు వారాలు అవుతున్నా ఇప్పటివరకూ లబ్ధిదారుల ఖాతాల్లో డ్వాక్రా రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. మరో రెండు, మూడు వారాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న వాతావరణం నెలకొన్న నేపథ్యంలో లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా తాపీగా ఉండటంపై లబ్ధిదారులు మండి పడుతున్నారు. పేరుకు నాలుగో విడత ఆసరా పథకం బటన్ నొక్కినా, రుణమాఫీ మాత్రం అమలుకు నోచుకోలేదు.

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలు కోసం బటన్లు నొక్కుతున్నా అని చెప్తున్న ముఖ్యమంత్రి అవి పనిచేస్తున్నాయా? లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతున్నాయా? అనే విషయాన్ని మాత్రం చెప్పడం లేదు.. ఆ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో పడకపోవడంతో వారిలో తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. వాయిదాల పర్వంతో దాటవేత ధోరణి సంక్షేమ పథకాలను నీరుగార్చడంలో తలమునకలైన రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకాన్ని కూడా పలు రకాలుగా నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోంది. అమ్మఒడి, చేయూత, పించను పథకాల మాదిరిగా ఆంక్షల పేరుతో లబ్ధి దారుల్లో కోత పెట్టేందుకు వీలు లేక పోవడంతో వాయిదాల పద్ధతిలో పథ కాన్ని నీరుగార్చేందుకు పూనుకుంది. ఫలితంగా ఎప్పుడో 2023 నాటికే పూర్తి స్థాయిలో అవ్వాల్సిన రుణమాఫీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకూ వాయిదా పడింది.

15నెలలు ఆలస్యంగా ప్రారంభం..

2019 ఏప్రిల్ 11లోపు డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని జగన్ 2019 ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అప్పటికే రుణాలు చెల్లించి ఉంటే వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచిన 15 నెలల వరకూ ప్రభుత్వం ఈ హామీ అమలుకు పూనుకోలేదు. 2019 మే చివర్లో అధికార పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి 2020 సెప్టెంబరు వరకూ పథకం ఊసే ఎత్తలేదు. 2020 సెప్టెంబరు 11న వైఎస్సార్ ఆసరా పేరుతో ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని ప్రారంభించి, ఉమ్మడి జిల్లాలో 74,640 గ్రూపులకు 74,169 గ్రూపులకు చెందిన 6.97 లక్షల మందిని అర్హులుగా గుర్తించింది. వారికి రూ.2,480 కోట్ల మేర రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. వాటితోపాటు బాపట్ల జిల్లాలో కలిసిన చీరాల డివిజన్లో మరో లక్ష మందికి మరో రూ.350 కోట్ల మేర రుణమాఫీ చేయాల్సి ఉంది. మొత్తంగా మూడు జిల్లాల్లో నాలుగు విడతల్లో దాదాపు 8 లక్షల మందికి దాదాపు 2,800 కోట్ల రూపాయల రుణమాఫీ చేయాలి. తొలివిడత జిల్లాలోని 7 లక్షల మందికి ఈ పథకం ద్వారా రూ.698 కోట్లు పంపిణీ చేశారు. తొలిసారి 15 నెలలు ఆలస్యంగా 'ఆసరా'ను ప్రారంభించిన ప్రభుత్వం రెండో విడత ఒక నెల ఆలస్యంగా 2021 అక్టోబరు 7న ప్రారంభించింది. లబ్ధిదారులకు రూ.696 కోట్లు పంపిణీ చేశారు. మూడో విడత రుణమాఫీని ఆరు నెలల ఆలస్యంగా ప్రారంభించారు. 2022 అక్టోబరు నుంచి అదిగో ఇదిగో అంటూ 2023 మార్చి చివరి వరకూ నెట్టుకొచ్చి మూడో విడత పథకాన్ని ప్రారంభించారు. అప్పుడు మరో 699 కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి బటన్ నొక్కినా లబ్ధిదారులకు నెల రోజుల వరకూ నగదు అందలేదు. ఏప్రిల్ చివర, మే తొలినాళ్ల వరకూ వారు ఎదురు చూడాల్సి వచ్చింది. తాజాగా నాలుగో విడత రుణమాఫీదీ అదే పరిస్థితి. ముఖ్యమంత్రి జనవరి 23న బటన్ నొక్కి పథకాన్ని ప్రారంభించినా లబ్ధిదారులకు మాత్రం రుణమాఫీ దక్కలేదు.

నాలుగో విడత ఇలా..

జిల్లా	సంఘాలు	లబ్ధిదారులు	జమ కావాల్సిన మొత్తం
గుంటూరు	29,322	2,86,000	రూ.246 కోట్లు
పల్నాడు	25,168	2,47,833	రూ.190 కోట్లు
బాపట్ల	30,604	3,00,000	రూ.263 కోట్లు

ఎన్నికల ప్రచారం..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ). పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) శాఖల పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో ఆసరా పథకం కింద నాలుగో విడత రుణమాఫీ జరగాలి. కాగా ఆసరా పథకాన్ని ప్రభుత్వం ఎన్నికల ప్రచారానికి వాడుకోవాలని చూస్తోందన్న విమర్శలున్నాయి.ఆ విమర్శలకు బలం చేకూర్చేలా గ్రామగ్రామాన 'ఆసరా' వారోత్సవాల పేరుతో సమావేశాలు పెట్టి చెక్కులు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారులను పిలిపించుకుని ఆర్భాటంగా సభలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరై తమ ప్రభుత్వ గొప్పలు చెప్పుకుంటూ ఊక దంపుడు ఉపన్యాసాలతో ఆసరా సమావేశాలను ముగిస్తున్నారు. అయితే రోజులు గడుస్తున్నా ఆసరా నగదు జమ కావడంలేదు. దీంతో ఇదంతా వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగమని లబ్ధిదారులు భావిస్తున్నారు. మరో వైపు ఎన్నికల కోడ్ తరుముకు వస్తోంది. అలాంటి సమయంలో ఇలా నగదు జమ చేయకుండా జాప్యం చేస్తుండ డంపై లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



- ఏఎన్‌యూలో ఇష్టారాజ్యం
- బీఈడీ విద్యార్థుల్లో ఆందోళన
- వసూళ్లే లక్ష్యంగా పరీక్షల నిర్వహణ
- కోర్సు ప్రారంభమైన 18 రోజులకే పరీక్షలు
- ఇంటర్న్‌షిప్ లేకుండానే ఫైనల్ పరీక్షలు
- ప్రయోగ పరీక్షల పేరిట దళారుల దందా
- స్పాట్, యాజమాన్య కోటా సీట్ల పేరిట వసూళ్లు

బీఈడీ.. బరితెగింపు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 9: సాధారణంగా ఏదైనా కోర్సుకు సంబంధించి అకడమిక్ క్యాలండర్ ఉంటోంది. ఆ ప్రకారమే పరీక్షలు, తరగతులు, ఫీజులు తదితరాలు ఉంటాయి. కానీ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం(ఏఎన్‌యూ)లో బీఈడీ కోర్సు నిర్వహణలో ఇష్టారాజ్యంగా ఉంది. అక్రమాలతో వర్సిటీ అధికారులు బరితెగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అకడమిక్ క్యాలండర్‌కు తరగతులకు, పరీక్షలకు సంబంధం లేకుండా వసూళ్లే లక్ష్యంగా కోర్సు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో అయోమయం, ఆందోళన నెలకొంది. ఏఎన్‌యూ పరిధిలో దాదాపు 175పైగా బీఈడీ కళాశాలలు ఉన్నాయి. అయితే ముందస్తుగా భారీ స్థాయిలో వసూళ్లకే పరీక్షలు అన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇంటర్న్‌షిప్ లేకుండానే ఫైనల్ ప్రయోగ పరీక్షల ఫీజు, హాల్‌టిక్కెట్లు లేకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా చేపట్టడంలో ఆంతర్యం ఏమిటో వర్సిటీ అధికారులకే తెలియాలని కళాశాలల అధ్యాపకులు ఆరోపణలు చేస్తున్నారు. బీఈడీ 2022-24 నాలుగో సెమిస్టర్ తరగతులు ఈ ఏడాది జనవరి 29 నుంచి ప్రారంభమయ్యాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం మార్చిలో ఇంటర్న్‌షిప్, ఏప్రిల్‌లో ఫైనల్ ప్రయోగ పరీక్షలు నిర్వహించాలి. అయితే కోర్సు ప్రారంభమైన 18 రోజులకే అంటే ఫిబ్రవరి 16 నుంచి ప్రయోగ పరీక్షలను నిర్వహిస్తున్నారు. బీఈడీ 2022- 24 విద్యా సంవత్సరం ఫిబ్రవరి 28 2023న ప్రారంభిస్తే రెండేళ్ల కోర్సులో 11 నెలలకే ఫైనల్ పరీక్షల్ని ఏ ఇతర యూనివర్సిటీల్లో లేనివిధంగా ఎలా నిర్వహిస్తారో అధికారులకే తెలియాలన్న విమర్శలున్నాయి.

ఒకే రోజు.. రెండు పరీక్షలు

ఒకే రోజున టెట్... బీఈడీ ప్రయోగ పరీక్షలు తేదీలు విడుదల కావడంతో విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఏపీ టెట్ (2024) పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి 9 వరకు జరగను న్నాయి. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నిర్వహించే బీఈడీ (2022-24) ఫైనల్ ప్రయోగ పరీక్షలు కూడా ఈ నెల 26 నుంచి మార్చి 6 వరకు నిర్వహించనున్నారు. దీంతో అనేక మంది విద్యా ర్థులు ఒకే రోజు రెండు పరీక్షలకు హాజరుకావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.


అధికారి పేరుతో వసూళ్లు..

వర్సిటీలో ఓ అధికారి అనుచరుడు, లెక్చరర్ అయిన ఓ వ్యక్తి బీఈడీ కోర్సులో అన్నీ తానై వ్యవహరిస్తున్నాడనే ఫిర్యాదులు న్నాయి. పరీక్షలు లేకుండా చూస్తానని అక్రమ వసూళ్లకు తెరలేపినట్లు ఆరోపణలున్నాయి. ప్రతి కళాశాల రూ.2.50 లక్షలు, తనిఖీ బృందాలకు రూ.30 వేలు చెల్లిస్తే విద్యార్థుల హాజరుతో సంబంధం లేకుండా, పరీక్షలు లేకుండా మార్కులు వేసి పంపుతానని లాబీయింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. 50 మంది విద్యార్థులు ఉంటే ఒకరేటు, 100 మంది అయితే మరో రేటు అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని అధ్యాపకుల నుంచే ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న బీఈడీ కౌన్సెలింగ్‌లో పూర్తి స్పాట్ సీట్లను, యాజమాన్య కోటా సీట్లను 20శాతం ఈడబ్ల్యూఎస్, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించేలా చూస్తానని, కొంతమంది మంత్రుల పేరుతో వసూళ్లకు దిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. 50 సీట్లు ఉంటే రూ.50 వేలు, 100 సీట్లు ఉంటే రూ.లక్ష చొప్పున దండుకుంటున్నట్లు సమాచారం.

నేను బతికే ఉన్నా..

మృతుల జాబితాలో చేర్పుపై అభ్యంతరం

- సంబంధీకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- మాచర్లలో చనిపోయినా జాబితాలో తొలగని ఓట్లు 321




మృతుల జాబితాలో వీరాంజనేయులు ఓటు


వినుకొండ, మాచర్ల, ఫిబ్రవరి 8: నేను బతికే ఉన్నా అన్న వారి ఓట్లను మాత్రం తొలగించారు. వాళ్లు చనిపోయారు.. అని ఆధారాల సహా ఇచ్చానా వారి ఓట్లను అలాగే ఉంచారు.. ఇదీ ఎన్నికల అధికారుల బరితెగింపు. విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నా ఎన్నికల అధికారులు తమ ధోరణి మార్చుకోకపోవడంపై అటు ఓటర్లు, ఇటు ప్రతిపక్ష పార్టీల నాయకులు మండిపడుతున్నారు. తుది జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, తప్పులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసినా ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని తెలుస్తోంది. తుది జాబితాలోని అవకతవకలు చూసి విస్తుపోతున్నారు. ఓటరు జాబితాల్లో తప్పులను సరిదిద్దాలని ఉన్నతస్థాయి అధికారులు పదేపదే బీఎల్‌వోలను హెచ్చరించినా అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు పట్టించుకోవడంలేదని అర్థమవుతుంది. నూజెండ్ల మండలం కొండలరాయునిపాలెంలో తాడిబోయిన వీరాంజనేయులు ఓటు తొలగించాలని ఆయన భార్య సీఈవో ఆంధ్ర వెబ్ సైట్‌లో ఫారం 10 ద్వారా దరఖాస్తు చేసినట్లు ఇటీవల వెలుగుచూసింది. బూత్ నెం. 271, క్రమ సంఖ్య 333లో ఉన్న తాడిబోయిన వీరాంజనేయులు గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఆయన బతికుండగానే ఆయన మృతి చెందాడని ఆయన భార్య ఫారం 7 దరఖాస్తు చేసినట్లు ఈ ఏడాది ఫిబ్రవరి 3న సీఈవో ఆంధ్ర వెబ్ సైట్‌లో ఫారం 10 ద్వారా వెలుగులోకి వచ్చింది. తన భార్య నిరక్షరాస్యులని అలాంటిది వెబ్‌సైట్‌లో ఎలా దరఖాస్తు చేసుకుంటుందని వీరాంజనేయులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బతికే ఉన్నానని, తాను మృతిచెందానని దరఖాస్తు పెట్టిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుని ఓటు పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే తనయుడికి రెండు ఓట్లు

మాచర్ల నియోజకవర్గంలో రమారమి 750 ఓట్ల వరకు డబుల్ ఎంట్రీలను టీడీపీ గుర్తించింది. అందులో ప్రముఖుల ఓట్లూ ఉన్నాయి. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనయుడైన గౌతమ్‌రెడ్డి ఓటు సొంతూరు వెల్దుర్తి మండలం కండ్లకుంటలో, మాచర్లలో ఉంది. టీడీపీ నుంచి ఇటీవలే అధికారపార్టీలో చేరిన కొమ్మారెడ్డి చలమారెడ్డి, ఆయన సతీమణి అనసూయ, కుమారుడు శ్రీనివాసరెడ్డి, కోడలు స్రవంతిల ఓట్లు కూడా కండ్లకుంటతో పాటు మాచర్లలో నమోదై ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే దివంగత పిన్నెల్లి లక్ష్మారెడ్డి కుమారుడైన పిన్నెల్లి మధు సతీమణి గీతలకు రెండు దగ్గర్ల ఓట్లు ఉన్నాయి. స్వచ్ఛందంగా డబుల్ ఎంట్రీ ఓటును తొలగించుకుని ఆదర్శంగా నిలవాల్సిన రాజకీయ నేతలు సైతం కిమ్మనకుండా ఉన్నారు. అలాగే నియోజకవర్గంలో చనిపోయి ఏళ్లు గడిచినా ఆ ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయి. ఇలాంటి ఓట్లు రమారమి 325 వరకు ఉన్నాయని టీడీపీ చెబుతోంది. మృతుల ఓట్లు, డబుల్ ఎంట్రీలపై మరోమారు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసేందుకు టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి సిద్ధమవుతున్నారు.



చలమారెడ్డి, ఎమ్మెల్యే పీఆర్కే తనయుడు గౌతమ్‌రెడ్డి, పిన్నెల్లి గీతా డబుల్ ఎంట్రీ ఓట్లు



మిర్చి ధరపై.. ఉత్కంఠ

- వచ్చే వారం మార్కెట్‌పై అందరి దృష్టి
- కొంచెం పెరిగితే బావుంటుందని రైతుల ఆశ

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే వారం మిర్చి మార్కెట్ ఎలా ఉండబోతుందోనన్న ఉత్కంఠ అటు రైతు లు, ఇటు వ్యాపారవర్గాల్లో నెలకొన్నది. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కొంచెం అటు, ఇటుగా మిర్చి ధరలు కొనసాగుతున్నాయి. దీంతో రైతులు అంత సంతోషంగా లేరు. ఒక్క తేజ వెరైటీ మిర్చి రకానికి మాత్రమే క్వింటాల్ రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు ధర లభ్యమౌతున్నది. మిగతా రకాలన్నింటికి రూ.14 వేల నుంచి రూ.17 వేల మధ్యనే ధర వస్తున్నది. సీజన్ మొదట్లో ఉన్న ధరతో పోల్చితే ఇప్పుడు క్వింటాల్‌కు రూ.5 వేల వరకు వ్యత్యాసం కనిపిస్తున్నది. వారం క్రితం మరింత పడిపోయిన ధర ఈ వారంలో కాస్త నిలబడింది. ఈ నేపథ్యంలో వచ్చే వారం ధర పడిపోకుండా ఉంటే రాబోయే రోజుల్లో పెరగడమే తప్ప తగ్గదన్న భావన ప్రతీ ఒక్కరు వ్యక్తపరుస్తున్నారు. గత నవంబరులోనే మిర్చి సీజన్ గుంటూరు వ్యవసాయ మార్కెట్‌లో ప్రారంభమైంది. మొదట్లో రాయలసీమ జిల్లాల నుంచి ఎక్కువగా పంట వచ్చింది. ఇప్పుడు ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి రైతులు సరుకు తీసుకొస్తున్నారు. గత డిసెంబరులో వచ్చిన తుపాను వల్ల ఇంకొల్లు మొదలు ప్రత్తిపాడు మండలం వరకు మిర్చి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దాంతో ఆయా ప్రాంతాల నుంచి సరుకు రావడం లేదు. ప్రస్తుతం రోజుకు సగటున లక్షా 10 వేలకు పైగా మిర్చి టిక్కీలను రైతులు తీసుకొస్తున్నారు. నాన్ ఏసీ వెరైటీలైన 334, నెంబరు. 5, 274, 341, 4884, సూపర్ 10లకు క్వింటాల్ ధర రూ.16 వేల మధ్యనే లభిస్తున్నది. బ్యాడిగి, దేవనూరు డీలక్స్ రకాలకు రూ.18 వేల వరకు కొనుగోలుదారులు ధర పెడుతున్నారు. కాగా దూర ప్రాంతాల నుంచి సరుకు తీసుకొచ్చిన రైతులు వచ్చిందే దక్కుదల అన్నట్లుగా విక్రయిస్తున్నారు. వెనక్కు తీసుకెళ్లి కోల్డ్‌స్టోరేజ్‌లో పెట్టినా ఛార్జీలు చెల్లించాలి. అలానే మార్కెట్ సీజన్ ముగిసి ఆగస్టు వస్తే తప్ప పెరగదు. ఈ నేపథ్యంలో తీసుకొన్న పంట రుణాలు చెల్లించడానికి తొలి కాపుని విక్రయిస్తున్నారు. ఈ వారంలో లభిస్తున్న ధర కాస్త ఫర్వాలేదని చెబుతున్నారు.



గుణదలమాత వంద వసంతాల వేడుకలను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్న రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు

వైభవంగా గుణదల మాత శతాబ్ది మహోత్సవాలు ప్రారంభం

విజయవాడ (గుణదల), ఫిబ్రవరి 9: శ్రీ సభలో లూర్దుమాత ఆధ్యాత్మిక తల్లిగా భక్తులకు వరాలు అందిస్తూ విరాజిల్లుతోందని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. గుణదల లూర్దుమాత శతాబ్ది మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా డయోసిస్ గురువులతో కలిసి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం నుంచి బిషప్ గ్రాసీ ఉన్నతపాఠశాల మైదనంలో ఏర్పాటు చేసిన వేదిక వరకు లూర్దుమాత స్వరూపాన్ని ఊరేగించారు. ఉదయం 7గంటలకు కళావేదికపై మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఎస్ఎస్‌సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్‌రాజు, వికారల్ జనరల్ మేశపాం గాబ్రియేలు గోల్డెన్, సిల్వర్ జూబిలేరియన్ గురువులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు.

అంతులేని అప్పులు!

- **రూ.11.23 లక్షల కోట్లు దాటిన రుణాలు**
- **కొత్తగా ఇంకో రూ.2వేల కోట్ల అప్పు**

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కార్ తెస్తున్న అప్పులకు అంతేలేదు. 2023 నాటికి రాష్ట్ర అప్పులు రూ.6.23 లక్షల కోట్లకు చేరాయని, వైసీపీ దాస్తున్న కార్పొరేషన్ అప్పులు వీటికి కలపాలని కాగ్ నివేదిక బయటపెట్టిన మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వం ఇంకో రూ.2,000 కోట్ల అప్పులు తెచ్చేందుకు సమాయత్తమవుతోంది. ఫిబ్రవరి 13న ఆర్‌బీఐ నిర్వహించే సెక్యూరిటీల వేలంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం ఈ అప్పు తీసుకురానుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంకు నుంచి ప్రభుత్వం తెచ్చిన మంగళవారం అప్పులు రూ.68,000 కోట్లకు చేరుకున్నాయి. ఇవికాకుండా కార్పొరేషన్ల నుంచి ప్రభుత్వం అప్పులు తెస్తోంది. వీటి వివరాలు ఇవ్వండంటూ కాగ్ ఐదేళ్ల నుంచి ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నప్పటికీ సమాధానం మాత్రం ఇవ్వడం లేదు. దీంతో కాగ్ తన నెలవారీ నివేదికల్లోనూ, ఆర్థిక సంవత్సరంపై పూర్తిస్థాయిలో ఇస్తున్న నివేదికల్లోనూ అరకొర అప్పులనే చూపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం అప్పులు రూ.11.23 లక్షల కోట్లు దాటగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జగన్ సర్కార్ చేసిన అప్పులు రూ.1,05,000 కోట్లు దాటాయి.

దళిత కూలీకి ఊరట

- **రూ.1,11,198 బిల్లు చెల్లించొద్దన్న అధికారులు**

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 9: ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో కూలి పని చేసుకునే పిల్లెం వెంకయ్యకు రూ.1,11,198 విద్యుత్ బిల్లు వచ్చిన ఘటనపై అధికారులు స్పందించారు. అధిక మొత్తం బిల్లు ఇచ్చిన అధికారులు, అది చెల్లించలేదని సర్వీసు కట్ చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో స్పందించిన ఇన్‌చార్జి ఏడీ సుబ్బారావు.. సిబ్బందితో కలసి వెంకయ్య ఇంటికి వెళ్లి సమస్య పరిష్కరించి, కొత్త మీటరు ఏర్పాటు చేశారు. నగదు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

వలంటీర్లకు 'బ్రేక్'!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం కోసం పని చేయరు. పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తలుగా మారిపోతారు. వలంటీర్లను వైసీపీ ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నా ఎవరూ అడ్డుకోలేని పరిస్థితి. విమర్శలు, ఆరోపణలు, ఫిర్యాదులను పట్టించుకునే దిక్కులేదు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వలంటీర్ల ప్రమేయం ఉండొద్దని ఈసీ చెప్పినా పెద్దగా ఫలితం లభించలేదు. కానీ... ఎన్నికల షెడ్యూలు వచ్చాక అలా ఉండదు. ఈసీ నేరుగా రంగంలోకి దిగుతుంది. వలంటీర్లపై పూర్తిస్థాయి నిఘా ఉంటుంది. ఈ క్రమంలో వారి సేవలను రాజకీయంగా వాడుకోవడం కష్టమవుతుందని గ్రహించిన వైసీపీ... కొత్త ప్రణాళిక రచించింది. అదే... రెండు నెలలపాటు వలంటీర్లను విధుల నుంచి 'తొలగించడం'! కోర్టు కేసుల పేరుతోనో, ఇంకేదైనా నెపంతోనో వారందరికీ తాత్కాలికంగా బ్రేక్ ఇస్తారు. ఈ రెండు నెలలపాటు వారికి ప్రభుత్వం నుంచి వేతనాలు ఇవ్వరు. అంటే వారు ప్రభుత్వ సేవల్లో లేనట్లు. ఆ సమయంలో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం పూర్తిస్థాయిలో పని చేయాలి. ఇలా... ఈసీ కళ్లు గప్పి ఏకంగా రెండున్నర లక్షల మంది వలంటీర్లను పార్టీ కార్యకర్తలుగా వాడుకోనున్నారు. ఓటర్లకు సంబంధించిన సమస్త సమాచారాన్ని వలంటీర్లు ఇప్పటికే సేకరించారు. దానిని వైసీపీ ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. నెలనెలా పెన్షన్ పంపిణీ చేస్తూ స్థానికులకు సుపరిచితులైన వలంటీర్ల పరపతిని ఇలా సొమ్ము చేసుకుంటారు.

రెండునెలలు 'సొంత జీతం'

'ఫిబ్రవరి పెన్షన్ పంపిణీ తర్వాత మీకు ఇతర విధులేవీ ఉండవు. ఈ రెండు నెలలు చాలా కీలకం. యాక్టివ్‌గా పని చేయండి. ప్రభుత్వం మిమ్మల్నే నమ్ముకుంది. మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా పక్కనపెడుతోంది" అని ఇప్పటికే ఎంపీడీవోలు (మండల స్థాయి అధికారులు) వలంటీర్లకు సందేశాలు పంపించారు. ఇప్పుడు... వైసీపీ ప్రజా ప్రతినిధులు రంగంలోకి దిగారు. "ఈ రెండు నెలలు మిమ్మల్ని ప్రభుత్వ విధుల నుంచి దూరం పెడతాం. దానికి బదులుగా మాకోసం పని చేయాలి. ప్రభుత్వం నుంచి మీకు అందేది నెలకు రూ.5వేలే. కానీ... ఈ రెండు నెలలు రూ.15వేల నుంచి 20 వేల వరకు మేం సొంతంగా ఇస్తాం" అని ఆశ చూపుతున్నారు. ఇలా... వలంటీర్లు వైసీపీ అభ్యర్థుల తరఫున క్షేత్రస్థాయిలో పని చేయడానికి రంగం సిద్ధం చేశారు. విపక్షాల ఫిర్యాదులకు ఈసీ స్పందించి ప్రశ్నించినా... 'వాళ్లను తొలగించాం. ప్రభుత్వ విధుల్లో లేరు' అని తప్పించుకోవచ్చన్నదే వైసీపీ ఆలోచన. కొన్ని రోజులుగా వైసీపీ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు వలంటీర్లపై 'ప్రత్యేక' ప్రేమ ప్రదర్శిస్తున్నారు. వారితో సమావేశాలు నిర్వహిస్తూ... 'రాబోయే ఎన్నికల్లో మీదే కీలక పాత్ర' అని చెబుతున్నారు. కుక్కర్లు, మిక్సీలు కానుకలుగా ఇచ్చి పంపిస్తున్నారు.

సొంత రాజకీయం కోసమే...

ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటర్.. వారి ద్వారానే పించన్ల పంపిణీ! ఇదీ స్కీమ్. ప్రతి ఏటా పెన్షన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తుంటే... ఈ పెన్షన్ పంపిణీ చేసే వలంటీర్లకు రూ.2 వేల కోట్లు వేతనాలుగా అందిస్తున్నారు. అంటే... 10 శాతం కమీషన్ ఇచ్చి వలంటీర్ల సేవలు వాడుకుంటున్నట్లయింది. ఈ పని సచివాలయ ఉద్యోగులు కూడా చేయగలరు. ప్రతి సచివాలయంలో కనీసం 10 మంది సచివాలయ ఉద్యోగులు పర్మనెంట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉండే పెన్షన్లను విభజించి ఆయా సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేసే అవకాశం ఉంది. పెన్షన్ల పంపిణీ నెలకోసారి మాత్రమే కావడం వల్ల వారికి పెద్ద భారం కూడా కాదు. మిగిలిన 'నవరత్నాల' అమలులో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకం. కానీ... వలంటీర్ల ద్వారా పించన్లు పంపిణీ చేయడంలోనే రాజకీయ దూరాలోచన ఉంది. ఇప్పటికే ప్రతి ఆరునెలలకు, ఏడాదికోసారి ఏదో ఒక సర్వే, పథకం పేరుతో మొత్తం ప్రజల సమాచారాన్ని వలంటీర్లు సేకరించారు. నిత్యం ఏదో ఒక కరపత్రం, బుక్‌లెట్ పంపిణీ చేయడం, జగన్ బొమ్మలు ఇళ్ల తలుపులపైన అంటించడం వంటి పనులకూ వారిని వాడుకుంటున్నారు. వైసీపీ అనుకున్నది అనుకున్నట్లు జరిగితే.. వలంటీర్లు ఎన్నికల్లో ఆ పార్టీ కార్యకర్తలుగా పని చేయడం ఖాయం!

కురుక్షేత్ర సంగ్రామానికి సిద్ధంకండి!

- **అంతిమ విజయం మనదే: భువనేశ్వరి**
- **నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 'నిజం గెలవాలి'**
- **నలుగురు కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ**



వనపర్తి మల్లిఖార్జునరావు సతీమణికి ఆర్థిక సాయం అందిస్తున్న నారా భువనేశ్వరి

నందిగామ/ చందర్లపాడు/ జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 9: 'మరో 60 రోజుల్లో జరగబోయే కురుక్షేత్ర సంగ్రామానికి సిద్ధంకండి. ఏ యుద్ధంలోనైనా అంతిమంగా ధర్మానిదే విజయం. రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలోనూ మనదే విజయం' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలుగుదేశం కేడర్‌లో జోష్ నింపారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు తట్టుకోలేక మరణించిన నందిగామ నియోజకవర్గం కోనాయపాలెంకు చెందిన వనపర్తి మల్లికార్జునరావు, జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలుకు చెందిన అలవాల గోపయ్య, గౌరవరానికి చెందిన కుక్కల ప్రకాశరావు, బలుసుపాడుకు చెందిన గండమాల వెంకటేశ్వరరావు కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.3 లక్షలు చొప్పున అందజేశారు. భువనేశ్వరికి నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో అపూర్వ స్వాగతం లభించింది.

మా ముందు హాజరవ్వండి!

- **ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రావత్‌కు హైకోర్టు ఆదేశం**

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఎస్ రావత్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రహదారులు భవనాలశాఖ పరిధిలోని ప్రభుత్వ భవనాలు, రహదారుల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో విఫలమైతే వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరుకావాలని ఇచ్చిన ఉత్తర్వులు పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. కనీసం హాజరు మినహాయింపు పిటిషన్ కూడా దాఖలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. తదుపరి విచారణ రోజు న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశిస్తూ ఫాం-1 నోటీసు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ అండ్‌బీలో పనులు చేపట్టిన తమకు బిల్లులు చెల్లించడం లేదంటూ పలువురు కాంట్రాక్టర్లు గతేడాది హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లకు మూడు నెలల్లో బిల్లులు చెల్లించాలని అదే ఏడాది మేలో హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఉత్తర్వులు అమలుకాకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు కోర్టుధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ఇటీవల విచారణకు రాగా.. ఈ నెల 9లోగా బిల్లులు చెల్లించడంలో విఫలమైతే కోర్టు ముందు హాజరుకావాలని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ఈ పిటిషన్లు శుక్రవారం మరోసారి విచారణకు రాగా, బిల్లు చెల్లించడంలో విఫలమైన విషయాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాదులు గుర్తుచేశారు. దీంతో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తదుపరి విచారణ రోజు న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించారు.

దళితుడి అంత్యక్రియలను అడ్డుకున్న వైసీపీ వర్గీయులు



అంత్యక్రియలను నిర్వహించకుండా అడ్డుకుంటున్న వైసీపీ వర్గీయులు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 9: ఓ దళితుడి అంత్యక్రియలను వైసీపీ వర్గీయులు అడ్డుకున్నారు. శ్మశానం కోసం దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూమి తమదని, అక్కడ అంత్యక్రియలు నిర్వహించడానికి వీల్లేదన్నారు. దీంతో బాధితులు సుమారు ఐదు గంటలపాటు మృతదేహాన్ని ఖననం చేయలేకపోయారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లిలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనగాల నాగన్న(68) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియల కోసం మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. వీరిని వైసీపీకి చెందిన శంకరనారాయణ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. శ్మశాన వాటిక స్థలం తమదని, అక్కడ మృతదేహాన్ని పూడ్చడానికి వీల్లేదని వాగ్వాదానికి దిగారు. అంత్యక్రియలను అడ్డుకోవడంతో బాధితులు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. తహసీల్దారు, సీఐ, ఎస్ఐలు గ్రామానికి చేరుకుని, అది ప్రభుత్వ భూమి అని, అడ్డుకుంటే చర్యలు తప్పవని చెప్పడంతో శంకరనారాయణ కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. అధికారులు, పోలీసులు దగ్గరుండి అంత్యక్రియలను పూర్తి చేయించారు.

'ఆడుదాం ఆంధ్ర' ఫైనల్స్ ప్రారంభం

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యువతలోని ప్రతిభను గుర్తించేందుకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తోందని పర్యాటక, క్రీడా, సాంస్కృతిక శాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' ఫైనల్ పోటీలను శుక్రవారం నగరంలోని రైల్వే స్టేడియంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ యువతలోని క్రీడా ప్రతిభను గుర్తించి సానబెట్టే ఉద్దేశంతోనే ఈ పోటీలను నిర్వహించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 సచివాలయాల పరిధిలో ఆటలు ఆడించామని, ఇప్పుడు విశాఖలో ఫైనల్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 13న ముగింపు కార్యక్రమంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను 8.30 గంటలకే మైదానానికి తరలించారు. క్రీడాకారులతో పరిచయాలు, అతిథుల ప్రసంగాలు పూర్తయ్యేసరికి 12 గంటలు దాటింది. అప్పటివరకూ ఎండలో కూర్చున్న క్రీడాకారులు నీరసించిపోయారు.

ఈవీఎంల నిర్వహణపై నోడల్ అధికారులకు శిక్షణ

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణపై (ఈవీఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్-ఈఎంఎస్ 2.0) అన్ని జిల్లాలకు చెందిన ఈవీఎంల నోడల్ అధికారులకు, సాంకేతిక సహాయకులకు అమరావతి సచివాలయంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. బిహార్, గోవా రాష్ట్రాలతో పాటు లడక్, లక్షద్వీప్, పుదుచ్చేరి, చండీగఢ్ తదితర కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన నోడల్ అధికారులు, సాంకేతిక సహాయకులు ఆన్‌లైన్ ద్వారా ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో గంజాయి ముఠా అరెస్ట్

- **సహకరించిన ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు కూడా**

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగ్గురు గంజాయి ముఠా సభ్యులు ఈ నెల 7న పోలీసులకు పట్టుబడ్డారు. విచారణలో వారికి ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు సహకరించినట్టు తేలడంతో వారినీ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు కేసు వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన ఉత్తర గౌడో, కుషా బుయాన్, రంజు గమాంగో ఈ నెల 7న 72 కిలోల గంజాయితో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వారి దగ్గర సూట్‌కేసులు, బ్యాగులు చూసి ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు జుదిష్టి బెహరా, వినోద్ బెహరా అనుమానంతో ఆరా తీశారు. గంజాయి ఉన్నట్టు గుర్తించి.. రూ.20 వేలు ఇస్తే వదిలేస్తామని, లేదంటే కేసులు పెడతామని బెదిరించారు. దీంతో రంజు గుమాంగో వారితో బయటకువెళ్లి నగదు చెల్లించాడు. వీరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో కొందరు ఎస్ఐ సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. నిందితుల వద్ద గంజాయి గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి నుంచి డబ్బులు తీసుకుని ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు సహకరించినట్టు తేలింది. దీంతో ఆ ఐదుగురినీ అరెస్టు చేశారు.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

దేనికి సిద్ధం సీఎం జగన్‌రెడ్డి సారూ..?

● 1515వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 9: సిద్ధం సిద్ధం అంటున్నావు సీఎం జగన్‌రెడ్డి.. దేనికి సిద్ధ పోలవరం పూర్తి చేయనందుకా.. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేస్తున్నందుకా, మూడు రాజధానులని బంగారం లాంటి రాజధాని అమరావతిని నాశనం చేసినందుకా.. అని 33వేల ఎకరాలు అమరావతికిచ్చిన రైతులు ప్రశ్నించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1515వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు రైతు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ, ఆశావర్కులు, అంగన్‌వాడీలు, రాష్ట్ర ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీలన్నీ తుంగలోకి తొక్కాడన్నాడు. అందుకే వారు రోడ్ల మీదకు వచ్చారన్నారు. అమరావతి రైతులకు చేసిన అన్యాయం ప్రతి వ్యవస్థల్లో ఉన్న వారికి పాలకులు చేశారన్నారు. ఇప్పటికైనా దిగిపోయే ముందు అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి, తట్ట మట్టి అయినా వేయాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

12న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 9: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు బాపట్ల జిల్లాలకు చెందిన 112 ప్రాజెక్టులను గుంటూరు పాత బస్టాండ్ కూడలి వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (ఉర్దూ) నందు ప్రదర్శిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఏ రవికుమార్ సెల్ నెంబర్ 9849627708ను సంప్రదించాలన్నారు.

నెట్ స్లో.. బోధన ఎలా?

● ప్రవీణ్ ప్రకాశ్‌కు స్పష్టం చేసిన ఉపాధ్యాయులు
● జిల్లాలోని పాఠశాలల తనిఖీ
● ఉపాధ్యాయులకు శిక్షణ లేమిపై కమిషనర్ ఆరా
● గడ్డిపాడు పాఠశాలలో అదనపు బెంచీలపై ఎంఈవోపై అగ్రహం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 9: నెట్ స్పీడు లేకుంటా ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డుల ద్వారా బోధన సాధ్యం కావడం లేదని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ శుక్రవారం జిల్లాలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పెదకాకాని జడ్పీస్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. పెదకాకాని జడ్పీ స్కూల్ ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డులు వినియోగించకుండా బోధన చేయడాన్ని ఆయన పరిశీలించారు. నెట్ స్పీడులేని కారణంగా సాధారణ బోర్డులపైనే బోధన అందిస్తున్నామని ఉపాధ్యాయులు సమాధానం చెప్పారు. అనంతరం రూరల్ మండలంలోని గడ్డిపాడు పాఠశాలను సందర్శించారు. అక్కడ అవసరానికి మించి ఉన్న బెంచీలను పరిశీలించారు. వెంటనే అవసరమైన చోటకు తరలించాలని లేకుంటే ఎంఈవో జీతం నుంచి బెంచీల ఖర్చును రికవరీ చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. నాడు నేడు పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్వోప్లాంట్, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. అనంతరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత, ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ తదితరులతో విడివిడిగా మాట్లాడారు. ప్రయోగ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, నాడు నేడు పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈవో పి.శైలజ, సమగ్రశిక్ష పీవో విజయలక్ష్మి ఉన్నారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీలకు వచ్చిన ప్రవీణ్‌ప్రకాశ్ చిత్రంలో ఆర్ఐవో జుబేర్, ప్రిన్సిపాల్ సునీత తదితరులు


పెదకాకాని జడ్పీస్కూల్ వద్ద ప్రవీణ్‌ప్రకాశ్ కాన్వాయ్

మంత్రుల కాన్వాయ్ తలిపిస్తూ పర్యటన..

పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ పర్యటన మంత్రుల పర్యటనకు ధీటుగా సాగింది. ఆయన వెంట అధికార గణం కార్లు బారులు తీరడంతో మంత్రుల కాన్వాయ్‌ని తలపించింది. పెదకాకాని జడ్పీస్కూల్ వద్ద నుంచి కాన్వాయ్ ప్రయాణిస్తున్న వైనాన్ని కొంతమంది ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ నయాదందా

● ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి దందాలకు తెరతీశారని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విమర్శించారు. అరండల్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయం కంటే తన సొంత ఆదాయమే లక్ష్యంగా మైనింగ్ అనుమతులు తనకు సంబంధించిన ప్రైవేట్ వ్యక్తులకు మైనింగ్ అప్పగించేందుకు కుట్రపన్నారని ఆరోపించారు. ఇప్పటికే 6 జిల్లాల్లో తన బినామీలైనవారికి మైనింగ్ కట్టబెట్టారన్నారు. ప్రయోగాత్మకంగా చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి మనుషులకు కట్టబెట్టి, ఆ తరువాత కడప, అనంతపురం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, గుంటూరు జిల్లాల్లో బినామీలకు మైనింగ్ కట్టబెట్టారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏఎంఆర్ వాళ్లకు మైనింగ్ అనుమతి వచ్చింది. నెలకు రూ.10 కోట్లకు పాట పాడిన వారు వాళ్లంతట వాళ్ల బిల్లులు ముద్రించి రవాణా చేస్తున్నారు. తప్పుడు క్యూఆర్ కోడ్‌లు ముద్రించి మోసం చేస్తున్నారన్నారు. పాట పాడినప్పుడు చెల్లించిన సెస్ తప్ప ఆ తరువాత ఎవరూ చెల్లించలేదన్నారు. ఈ బిల్లులను పెట్టి ప్రభుత్వం నుంచి మినహాయింపులు, దొంగ బిల్లులు పెట్టి చెక్‌పోస్టుల ద్వారా అక్రమంగా వసూళ్లకు పాల్పడుతూ నెలకు రూ.10 కోట్లు దోచుకుంటున్నారన్నారు. ఇలా ప్రతి నెలా ఒక్కో జిల్లా నుంచి అనధికారికంగా రూ.10 కోట్లు చొప్పున 60, 70 కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు వెళుతున్నాయన్నారు. మైనింగ్ ట్రాన్స్‌పోర్ట్ చేసేవాళ్ళ టీడీఎస్ వసూళ్లు చేసి వాటిని ఇన్‌కమ్ టాక్స్ శాఖకు ఇవ్వకుండా వాటిని తాడేపల్లికి తరలిస్తున్నారన్నారు. జిల్లాకు మినరల్ ఫండ్ ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. వైసీపీ దోపిడీలు, అక్రమ వసూళ్లపై విసుగెత్తిపోయిన ప్రజలు వైసీపీని రాష్ట్రం నుంచి పారదోలటానికి సిద్ధంగా ఉన్నారని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో దాసరి రాజామాస్టారు, కంచర్ల శివరామయ్య, షేక్ ఫిరోజ్, పులివర్తి వెంకటేశ్వరరావు (హజార్) తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్రకుమార్, పక్కన రాజామాస్టార్

ఇజ్‌తిమా సభకు టీడీపీ సంపూర్ణ సహకారం

● మాజీ ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 9: నంబూరు- కొప్పురావూరు గ్రామాల సరిహద్దులో ఈనెల 10, 11 తేదీల్లో జరిగే దీన్ ఇజ్‌తిమా సభ ఏర్పాట్లను పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పరిశీలించారు. శుక్రవారం ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించి ముస్లిం మతపెద్దలు, నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని జరిపించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలంతా తరలివచ్చి ఒకే చోట ప్రార్థన జరిపించడం ఆనందదాయకమన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున సభ నిర్వహణకు కావలసిన సహకారాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేశం నాయకులు కూసం బ్రహ్మారెడ్డి, కుక్కల మల్లికార్జునరావు, తాళ్ల శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, ముస్లిం నాయకులు, సంఘ పెద్దలు, యువత పాల్గొన్నారు.


ఇజ్‌తిమ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

చెక్కుల పంపిణీ కోసం రహదారి దిగ్బంధం


వైఎస్సార్ ఆసరా పంపిణీ కోసం తెనాలి - చెరుకుపల్లి ప్రధాన రహదారిపై వేసిన టెంట్‌లు

అమృతలూరు, ఫిబ్రవరి 9: అధికార పార్టీ నాయకులు, అధికారులు ఆసరా చెక్కుల పంపిణీ సభను తెనాలి-చెరుకుపల్లి ప్రధాన రహదారిపై ఏర్పాటుచేయడంతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలో ఇరుకురోడ్డు గుండా ట్రాఫిక్ మళ్లించారు. దీంతో కొన్ని గంటలపాటు ఆర్టీసీ బస్సుల రాకపోకలను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ప్రధాన రహదారిపై టెంట్లు వేసి సభ నిర్వహించడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే చెక్కుల కోసం వచ్చిన మహిళలకు భోజన తయారీ ఏర్పాట్లను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఆసరా చెక్కుల పంపిణీ..

మహిళల అభ్యున్నతి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి లక్ష్యం అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండల కేంద్రం అమృతలూరు వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత చెక్కులను డ్వాక్రా సంఘ గ్రూపులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అశోక్‌బాబు మాట్లాడుతూ మండలంలోని గ్రూపులకు రూ.35 కోట్లు నాలుగు విడతల్లో మాఫీ చేయడం జరిగిందన్నారు. ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్, సర్పంచ్ దేవరకొండ రాము, యలవర్తి సురేష్‌బాబు, భట్టుమోషే, జడ్పీటీసీ లావణ్య, ఎంపీడీవో స్వరూపారాణి, తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

రోడ్డుప్రమాదంలో సెలూన్ షాపు నిర్వాహకుడి మృతి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 09: రోడ్డు ప్రమాదంలో సెలూన్ షాపు నిర్వాహకుడు మృతి చెందిన ఘనటపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని అంగలకుదురుకు చెందిన చింతలపూడి శివనాగేశ్వరరావు (33) తెనాలిలో సెలూన్ షాపు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి షాపు మూసివేసి తన ద్విచక్రవాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. తెనాలి - అంగలకుదురు మార్గ మధ్యలో నెంబరు ప్లేట్ లేని లారీ అతడి వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే శివనాగేశ్వరరావు మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకరరావు తెలిపారు.


శివనాగేశ్వరరావు ఫైల్‌ఫొటో

ఉత్సవాలకు కొండవీడు ముస్తాబు

యడ్లపాడు, ఫిబ్రవరి9: ప్రపంచ పర్యాటక ప్రదేశంగా గుర్తింపు పొందిన కొండవీడు.. ఉత్సవాలకు సిద్ధమైంది. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు జరగనున్న ఈ కొండ పండుగకు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేస్తున్న ఈ ఫెస్టివల్‌లో ఎటువంటి లోటు పాట్లు లేకుండా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి కొండవీడులో మకాం వేసి అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు. హెలికాప్టర్ రైట్ ట్రెయిల్ రన్‌ను శుక్రవారం కలెక్టర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజా నాయక్, ఆర్డీవో సరోజిని, యడ్లపాడు మండల రెవెన్యూ, మండల ప్రజా పరిషత్, విద్యుత్ శాఖలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


హెలికాప్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శివ శంకర్

ఆర్థిక క్రమశిక్షణ లేని రాష్ట్ర బడ్జెట్

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 9: రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణ లేని బడ్జెట్‌గా ఉందని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం ఎంత? దేని ద్వారా వస్తుంది? ఖర్చులు ఎంతన్నది? కనీసం స్పష్టత లేని విధంగా బడ్జెట్ ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేలా బడ్జెట్ ఉందని తెలిపారు. ప్రభుత్వం చేసిన రూ.9 లక్షల కోట్ల అప్పు ఎవరి జేబుల్లోకి వెళ్ళిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో చూపించిన కేటాయింపులకు తగ్గట్టు ఖర్చులు లేకనే రైతులు పంటల సాగుకు దూర మవుతున్నారన్నారు. డిస్కమ్ బకాయిలు రూ.27,284 కోట్లుగా చెపుతున్న ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ చార్జీల వడ్డనలో ఎక్కడా రాజీ పడడం లేదన్నారు. మద్యం మీద వచ్చే డబ్బుతో జగన్ ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. వైద్యం కోసం ఎంతో చేస్తున్నామని చెప్పుకొనే జగన్ ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం ఆరోగ్యశ్రీకి అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారన్నారు. రూ.35లక్షల పొదుపు సంఘాలకు బడ్జెట్‌లో మొండి చేయి చూపారన్నారు. రైతు భరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్య పెంచాల్సింది పోయి తగ్గించారన్నారు. సున్నా వడ్డీ పంట రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు కుదించటం ఏంటని? ప్రశ్నించారు. చేనేతలు తీవ్ర కష్టాల్లో ఉంటే ఈ బడ్జెట్‌లో వారికి కనీసం సంతృప్తి చెందే ప్రకటన చేయలేదన్నారు. సామాన్యుడికి ఏ మాత్రం ఉపయోగం లేని విధంగా వ్యవహరిస్తున్న జగన్ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అవుతుందని ఆయన స్పష్టం చేశారు.

పీవీకి భారతరత్న ఇవ్వడం తెలుగుజాతికి గర్వకారణం

● గల్లా జయదేవ్

గుంటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగువారందరికీ గర్వకారణమని గుంటూరు పార్లమెంట్ సభ్యుడు గల్లా జయదేవ్ అన్నారు. పీవీకి భారతరత్న రావడంపై శుక్రవారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. పీవీ సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ప్రజల క్షేమమే పీవీ జీవితంగా భావించారని, దేశంలో సంస్కరణలకు ఆద్యుడు ఆయనేనని కొనియాడారు. తెలుగుజాతి అణిముత్యం భారతరత్న పొందడం తెలుగు వారు అందరూ గర్వించదగిన విషయమన్నారు. పీవీ నరసింహారావుతో పాటు మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్, హరిత ఉద్యమ పితామహుడు ఎమ్మెస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించటం పట్ల కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

పీవీకి భారతరత్న ఇవ్వటం గర్వకారణం

రేపల్లె, ఫిబ్రవరి 9: తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వటం తెలుగు వారందరికి గర్వకారణమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన పీవీకి ఆలస్యంగానైన తగు న్యాయం జరిగిందని ఆయన అన్నారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని రాజకీయాలకు అతీతంగా ప్రతి తెలుగువాడు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారని తెలిపారు. ఈనాటికి పీవీకి గుర్తింపు లభించటం తెలుగువారందరికి లభించినట్లుగా భావించాలని ఆయన పేర్కొన్నారు. భారత హరిత ఉద్యమ పితామహుడు ఎంఎస్ స్వామినాథులకు భారత రత్న పురస్కారం లభించటం హర్షదాయకమన్నారు. స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఎంతో అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.


ఎమ్మెల్యే అనగాని

సర్వేలలో టీడీపీ, జనసేన విజయం స్పష్టం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో రాబోతున్నది తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభంజనమేనని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తాజా సర్వేలు అదే విషయం స్పష్టం చేస్తున్నాయని, జగన్ ఓటమిని ముందే ఖరారు చేస్తున్న మరో సంకేతం ఇది అన్నారు. ఇప్పటికే ప్రజలు నిర్ణయించుకున్న విషయమే ఇండియా టుడే సర్వేలో మరోసారి తేటతెల్లమైందన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ప్రత్తిపాటి ప్రజల జీవితాలను దుర్భరంగా మార్చిన ధరల మంటలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఓ వైపు విధ్వంసం, మరో వైపు అరాచకం తప్పా పాలన తెలియని జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారని, అభివృద్ధిలో పాతాళానికి పడవేసి ధరల మంటల్లో దేశంలో నెంబరు స్థానంలో నిలిపారని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. సంక్షేమం పేరిట బటన్ నొక్కుతున్నా అని డ్రామాలుడుతూ రూపాయి ఇచ్చి పది రూపాయలు కొట్టేస్తూ అన్ని వర్గాల ప్రజలను రోడ్ల పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఐదు సంవత్సరాల పాలన ఎలా ఉందో షాక్ కొడుతున్న కరెంటు బిల్లులు, మంట పుట్టిస్తున్న పెట్రోల్, డీజిల్ ధరలు, వాతలు తేలేలా చేస్తున్న వివిధ పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలే నిదర్శనమని అన్నారు. భవిష్యత్ బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీ, జనసేనకు మద్దతు తెలపాలని ప్రత్తిపాటి కోరారు.

పలువురు ఈవోలకు ఉద్యోగోన్నతి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 9: దేవదాయ శాఖలో ఫస్ట్ గ్రేడ్ ఈవోలుగా పనిచేస్తున్న పలువురు అధికారులకు అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పదోన్నతి పొందిన అధికారులు నూతన పోస్టుల్లో చేరారు. బాపట్ల జిల్లా కొల్లూరు గ్రూప్ దేవాలయాల ఈవోగా పనిచేస్తున్న వి.అనుపమను గుంటూరు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. గుంటూరు శారదానికేతన్ ఈవోగా ఉన్న సైదమ్మ బాయిని అడిగొప్పుల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం ఏసీగా బదిలీ చేశారు. నందివెలుగు గ్రూప్ దేవాలయాల ఈవో నల్లకాలువ శ్రీనివాస్‌రెడ్డిని కోటప్పకొండ ఏసీగా నియమించారు. మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డిని అదే దేవస్థానం ఏసీగా నియమించారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 1,07,077 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,23,756 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 79,736 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	21500
నెంబరు.5	11000	17000
273	13500	16000
341	11500	22100
4884	12000	16200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
సూపర్ 10	15000	17000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	22200
బ్యాడిగి	11000	20000
దేవనూరుడీలక్స్	13000	20000
తెల్లకాయలు	5000	12000

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు



బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వరరావును గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

రాష్ట్రం నుంచి రాక్షస పాలన సాగనంపుదాం

- ప్రజలను మోసం చేసేందుకే వరికపూడిశెల
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

దుర్గి, ఫిబ్రవరి 9 : టీడీపీ, జనసేన నేతలు ఐక్యమత్యంతో రాక్షస పాలనను రాష్ట్రం నుంచి సాగనంపేందుకు కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని కంచరగుంటలో గురువారం రాత్రి జనసేన జెండాను ఆవిష్కరించి అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని పిలిపించి వరికపూడిశెలకు శంకుస్థాపన చేయించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆ ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయించకపోవడం పల్నాడు ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రజాధనంతో కొత్తగా సిద్ధం అంటూ బోర్డులను పెట్టడం దేనికి సిద్ధం.. బాబాయి హత్య కేసును తేల్చడానికా.. ప్రత్యేక హోదా తేవడానికా.. పోలవరం పూర్తి చేయడానికా.. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడానికా.. కంపెనీలు తేవడానికి.. మద్యపాన నిషేదం చేయడానికా.. కరెంట్ చార్జీలు పెంచడానికా.. దేనికి సిద్ధమో తెలపాలని ప్రశ్నించారు. గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని పిన్నెల్లి సోదరులు ఊడ్చేసి కోట్లకు పడగలెత్తారన్నారు. అనంతరం జనసేన అరిగెల వెంకట్రావు నలుగురు విద్యార్థినులు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అలాగే మండలంలోని మంగాపురంతండాకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వరావులను పార్టీ నేతలు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి పులి హరి, తోటకూర శ్రీను, నక్షత్రపు ప్రసాద్, రుద్రాల రవి, బీమా అమరయ్య, సూరె బాలసుబ్బారావు, కాకర్ల హనుమంతురావు, కొత్తా గోపి, కోడె నాగరాజు, టీడీపీ నేతలు మేకల దాసు, వజ్రం నాయక్, జానకి రామయ్య, వంకమళ్ల కోటేశ్వరరావు, నాదెండ్ల శ్రీను, రాళ్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడిగా బడ్జెట్ : బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అంకెల గారడి తప్ప మరేమీ లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బడ్జెట్‌లో పన్నుల బాదుడు తప్ప మరేం కనిపించలేదన్నారు. పేరుకే బీసీ సంక్షేమ సంఘం సబ్‌ప్లాన్‌కు సంబంధించి రూ.75 వేల కోట్ల నిధులన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం పల్నాడు ప్రజలను మోసగించడమేనన్నారు. 35 లక్షల పొదుపు సంఘాలకు బడ్జెట్లో మొండి చేయి చూపారన్నారు. ఇప్పటికి ఏడుసార్లు ప్రజలపై విద్యుత్ భారం మోపిందన్నారు. విద్యార్థులకు అందించే ట్యాబుల్లోనూ రూ.1000 కోట్ల అవినీతికి ప్రభుత్వం పాల్పడిందన్నారు. జగనన్న విద్యాదీవెనలో సైతం ఏడు లక్షల మంది విద్యార్థులకు మొండి చేయి చూపారన్నారు. దశలవారీగా మద్యం నిషేదం చేస్తామని చెప్పి వేల కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.11.58 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయన్నారు. నేతన్ననేస్తం పేరుతో జగన్ ప్రభుత్వం వారి బతుకుల్లో నిప్పులు పోసిందని, రంగులు, నూలు, ముడిసరుకులపై సబ్సిడీ రద్దు చేసిందన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని కోరుతూ ప్రత్యేక పూజలు



చండీహోమంలో పాల్గొన్న యరపతినేని, సాయినిఖిల్ తదితరులు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 9: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు సుభిక్షంగా పాడిపంటలతో బాగుండటంతో పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు కావాలని కోరుతూ పిల్లుట్ల రోడ్డులోని ఆదర్శనగర్ కాలనీ వద్ద బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో వేద గాయత్రి సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చండీహోమంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు, చండీహోమం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా వుండాలని, రైతు శ్రామిక కర్షక వర్గం సంతోషంగా వుండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యరపతినేని సాయినిఖిల్, వేద గాయత్రి సమితి సభ్యులు, వేదపండితులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

13న ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 9: గురజాల నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ నేతల కుటుంబాలలో నేనొక సభ్యుడినేనని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న పిడుగురాళ్లలో కాకతీయ కల్యాణ మండపంలో నియోజకవర్గ ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర నాయకులు షేక్ బాబావలి మాట్లాడుతూ టీడీపీ అధికారంలో వున్నప్పుడు యరపతినేని శ్రీనివాసరావు హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు 45 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇచ్చి మక్కా యాత్రకు పంపించడం జరిగిందని, రేపటి ఎన్నికలలో రాష్ట్రంలో టీడీపీతో పాటు గురజాలలో యరపతినేనిని మరలా గెలిపించుకుంటే ముస్లిం మైనారిటీల చిరకాల వాంఛ అయిన హజ్‌యాత్ర కోరిక నెరవేరుతుందన్నారు. ఈ సమావేశంలో సయ్యద్ అమీర్‌అలి, చింతపల్లి హసన్‌అహ్మద్, షేక్ వలి, అబ్దుల్లా, ముజీబ్, ఫరీద్‌మేస్త్రి, షేక్ సైదా, గుత్తికొండ సుభాని, సయ్యద్ ఇర్షాద్, ఖాశింసైదా, నాయబ్ అబ్దుల్లా, అహ్మదా, మస్తాన్‌వలి, కళాయి బాజి, కరాలపాటి జాని, వాచర్ బుడే, జానీబాషా, ఖాజావలి, ఇంతియాజ్, జనసేన నాయకులు సలీం, సుభాని, సైదా, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 9: పట్టణ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి ఎ.అనురాధ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, వృద్ధులకు ర్యాంపులను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు, వసతులను కల్పించే దిశగా చూస్తున్నామని కమిషనర్ గిరికుమార్ తెలిపారు.

టీడీపీ హయాంలోనే గురజాల అభివృద్ధి

- అభివృద్ధి ఎమ్మెల్యే కావాలా.. కమీషన్ల ఎమ్మెల్యే కావాలా
- జైలుకు పోయేందుకు సిద్ధంగా జగన్‌రెడ్డి
- జయహో బీసీ సభలో యరపతినేని



గురజాలటౌన్, ఫిబ్రవరి 9: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే ఎమ్మెల్యే కావాలా.. ప్రతి శనివారం కమీషన్లు తీసుకునే ఎమ్మెల్యే కావాలా అని గురజాల నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకోవాలని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యరపతినేని పాల్గొని మాట్లాడారు. బీసీలకు పదవులు, రుణాలిచ్చి అక్కున చేర్చుకుంది టీడీపీ మాత్రమేనని అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అభివృద్ధి జరిగిందంటే టీడీపీ హయాంలో మాత్రమేనని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే టీడీపీని అధికారంలోకి తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అధికారం ఉందని చంద్రబాబును అక్రమంగా జైలుకు పంపారన్నారు. అదే రాజమండ్రి జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండు జగన్‌రెడ్డి అని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అధికార దాహానికి 11 మంది బీసీ నేతలను బలిచేయడమే కాకుండా 8 మంది చిన్నారులు క్వారీలో పడి మరణించడానికి కారకులయ్యారన్నారు. మండలంలోని పాతఅంబాపురంనకు చెందిన దళిత నేత విక్రమ్‌ను అత్యంత దారుణంగా హతమార్చారన్నారు. రెండు నెలలు కష్టపడండి.. ఐదేళ్లు మీకోసం నేను కష్టపడతానని యరపతినేని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు అనేక రకాలుగా ఇబ్బంది పడ్డారని, అంతేకాకుండా ఆర్థికంగా కూడా చాలామంది నష్టపోయారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారందరిని ఆదుకుంటామన్నారు. యువత కోసం చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి 20 వేల మంది యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా బీసీ నేతలు యరపతినేనిని గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రమశిక్షణ కమిటి సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకుడు వసంత సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు, జిల్లా కార్యదర్శి బడిదెల శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు నరసింహారావు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది సేవలందించాలి

మాచవరం, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో వుండి పంటల సాగు విషయంలో సూచనలు, సలహాలు ఇస్తూ రైతులకు సేవలందించాలని పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ వంకాయల రమేష్, ఎట రామమ్మ, సలహా మండలి సభ్యులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాలలో ఆసరా చెక్కుల పంపిణీ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 9 : తుమ్మలచెరువు, కరాలపాడు గ్రామాలలో వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరై మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ చేశారు. తుమ్మలచెరువులో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి ద్వారా మంచినీటిని అందించే పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ అల్లు సత్యవతి, ముడేల వెంకటేశ్వరరెడ్డి, చల్లా పిచ్చిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు...

దాచేపల్లి, ఫిబ్రవరి 9: దాచేపల్లిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమంలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరై లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, సాంబయ్య, మందపాటి రమేష్‌రెడ్డి, కోట కృష్ణ, టమాట సుభాని, ఖాదర్‌భాష, తదితరులున్నారు.

1600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మాచర్ల, ఫిబ్రవరి 9 : మాచర్ల సెబ్ అధికారులు శుక్రవారం మాచర్ల నియోజకవర్గంలోని కొత్తాపుల్లారెడ్డిగూడెంలో దాడులు జరిపారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి పాల్పడిన కేతావత్ వెంకటేశ్వర్లు తన ద్విచక్ర వాహనాన్ని సంఘటన ప్రదేశంలోనే వదిలిపారిపోయాడు. అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కిషోర్ తెలిపారు.

అతివేగం ప్రమాదాలకు ఆస్కారం

రెంటచింతల, ఫిబ్రవరి 9 : వాహనాలను అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం కలుగుతుందని మాచర్ల ఎంవీఐ డి.శేషురెడ్డి కోరారు. రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో శుక్రవారం విద్యార్థులకు జాతీయ భద్రతా వారోత్సవాల ప్రాధాన్యతను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రమాదాల జరిగే తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య, హెచ్ఎం దుర్గా ప్రసాద్, అనిల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎం.రాంబాబు, తుపాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామిని దర్శించుకున్న డిప్యూటీ ఈవో వేణుగోపాల్

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 9 : డిప్యూటీ ఈవో వేణుగోపాల్ శుక్రవారం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కొప్పునూరు పాఠశాల తనిఖీ

మండలంలోని కొప్పునూరు ఎంపీపీ పాఠశాలను శుక్రవారం డిప్యూటీ ఈవో వేణుగోపాల్ తనిఖీ చేశారు. బంగారుతల్లి ప్రొగ్రెస్‌పై అడిగి తెలుసుకొని బోధనా పద్ధతులను పరిశీలించారు. బాలనాగమ్మబాయి, నజీర్, థామసమ్మ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, అమర్‌నాథ్, వెంకట్, శేఖర్ ప్యానెల్ మెంబర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఐవి నాగమణి, పౌలురాజు, అప్పారావు, శ్రీనివాసరావు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే పథకంలో సఫాయి కార్మికులు నమోదు కావాలి

మాచర్ల, ఫిబ్రవరి 9 : పురపాలక సంఘ పరిధిలో సెప్టిక్ ట్యాంకు డ్రైవర్లు, హెల్పర్ల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పన, సామాజిక న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ (నమస్తే) పథకంలో సఫాయి కార్మికులంతా పేర్లు నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. దీనిపై ఈనెల 13వ తేదీన పురపాలక సంఘ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు.

రెంటచింతల తహసీల్దార్‌గా రామమోహనరావు

రెంటచింతల, ఫిబ్రవరి 9 : మండల తహసీల్దార్‌గా ఎస్.రామమోహనరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ టి.బ్రహ్మయ్య, ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు నాసరరెడ్డి, పల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడిగా పినాకపాణి

దాచేపల్లి, ఫిబ్రవరి 9: జిల్లా మండల విద్యాశాఖ అధికారుల సంఘం అధ్యక్షునిగా దాచేపల్లి మండల విద్యాశాఖ అధికారి-2 ఎం.పినాకపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాచేపల్లిలో శుక్రవారం జరిగిన సమావేశంలో జిల్లాలోని విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన పినాకపాణిని పలువురు అభినందించారు.

కొమెరపూడిలో దళిత చైతన్య యాత్ర

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 9 : నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు మండలంలోని కొమెరపూడిలో శుక్రవారం దళిత చైతన్య యాత్ర నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం దళితులను మోసం చేసిన విధానాన్ని టీడీపీ దళిత నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అళ్ల అమరేశ్వరరావు, ఎర్రా వెంకటేశ్వరరావు, ఎస్‌కే మస్తాన్, ఎస్‌కే హబీబ్, ఎస్సీ నాయకులు జొన్నలగడ్డ గురవయ్య, కొరబండి అశోక్, మస్తాన్, మేకా వంశీ, పల్లెలుగు మోజేష్, చింతరాల రాజు, సంకటి ఏసోబు, కొరబండి చిన్న, గుంటూరు ఆశీర్వాదం, బొజ్జా కాంతారావు, శ్రీనివాస్, చిలకా మనోహర్ పాల్గొన్నారు.

అంకెల్లో సంక్షేమం.. ఊహల్లో అభివృద్ధి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి



సత్తెనపల్లి, ఫిబ్రవరి 9 : అంకెల్లో సంక్షేమం, ఊహల్లో అభివృద్ధి అన్న చందంగా ఏపీ బడ్జెట్ తయారైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఎన్నికల స్టంట్‌గా ఉందన్నారు. వైసీపీ ఎన్నికల ప్రచారం కోసం బడ్జెట్ ప్రవేశ పెట్టినట్టు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో కనీసం రోడ్లు వేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. విద్యుత్, రిజిస్ట్రేషన్ తదితర చార్జీలను విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని ఆర్థిక భారాన్ని వేసిందని ఆయన ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వైసీపీ వైరెస్‌ను తరిమికొట్టాలి : బొర్రా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 9 : రాష్ట్రం నుంచి వైసీపీ వైరెస్‌ను తరిమికొట్టాలని జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోక కళ్యాణార్థం పవన్ కళ్యాణ్ సీఎం కావాలని కోరుతూ నకరికల్లు మండలం చేజర్ల కపోతేశ్వరస్వామి దేవాలయంలో ఐదు రోజుల పాటు రాజ శ్యామల యాగం చేసినట్టు ఆయన తెలిపారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు.

హసానాబాద్‌లో 'మన ఇంటికి మన కొమ్మాలపాటి'

క్రోసూరు, ఫిబ్రవరి 9 : మండలంలోని హసానాబాద్‌లో శుక్రవారం మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గుడిపాడు బాషా, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి మొగల్ జాన్, నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షులు గాదె సూర్యనారాయణ, టీడీపీ మండల నాయ కులు షేక్ బడా, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

- అచ్చంపేట, ఫిబ్రవరి 9 : అచ్చంపేటలోని రాజీవ్ నగర్ 52వ బూత్‌లో మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ, జనసేన ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్ళి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, ఎస్‌కే కాసుల, తిరువాయిపాటి ఆంజనేయులు, వెనిగండ్ల కోటయ్య, తాళ్ళూరి సుబ్బారావు, రేపూడి తోమాస్, సందెపోగు సామేలు, యడ్లపల్లి బుచ్చిబాబు, నెల్లూరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.
- పెదకూరపాడు, ఫిబ్రవరి 9 : మండలంలోని రామాపురంలో శుక్రవారం మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అంగన్ వాడీ యూనియన్ రాష్ట్ర నాయకురాలు గంగినేని లీలావతి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, టీడీపీ నేతలు వడ్లమూడి అప్పారావు, నెల్లూరి మల్లికార్జునరావు, మక్కెన సాగర్, మద్దినేని వెంకట సత్యనారాయణ, చెన్నుపాటి బుల్లిబాబు, గుంటుపల్లి కోటేశ్వరరావు, వెల్లలచెరువు సురేష్, నార్ల సుబ్బారావు, వేములపల్లి మల్లేశ్వరరావు, సుంకర చిన వెంకటేశ్వర్లు, కొరిటాల మస్తాన్‌నావు, బండ్లమూడి వెంకటేశ్వర్లు, నల్లపాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు చేర్చే వారిపై చర్యలు తీసుకోవాలి : గంగారావు

బెల్లంకొండ ఫిబ్రవరి 9 : మండలంలో దొంగ ఓట్లు చేర్చే వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుంజా గంగారావు అన్నారు. బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ యమ్మాజీగూడెం గ్రామంలో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వైసీపీ నాయకులు ఓట్లు చేర్పించటంపై ఆర్‌వో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, గుడిసె కొండయ్య, ఓర్చు రాంబాబు, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, గుంజా శివయ్య, యంచయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేసే వారికే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓటు

క్రోసూరు, ఫిబ్రవరి 9 : వచ్చే ఎన్నికల్లో ఓపీఎస్ అమలు చేస్తామని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో హామీలు ఇవ్వటంతో పాటు అమలు చేసే వారికే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు వేయటం జరుగుతుందని ఎస్‌టీయూ జిల్లా సీపీఎస్ కన్వీనర్ శరత్‌కుమార్ ప్రకటించారు.

- దుర్గి, ఫిబ్రవరి 9: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేసే వారికే తమ ఓటు అని యూటీఎఫ్ నేతలు అన్నారు. మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఓట్ ఫర్ ఓపీఎస్ గోడ ప్రతులను విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, దుర్గా ప్రసాద్, రంగయ్య, అమరలింగేశ్వరరావు, రాధాకృష్ణమూర్తిపాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

క్రోసూరు, ఫిబ్రవరి 9 : మండలంలోని హైస్కూళ్ళు, యూపీ పాఠశాలలు, ఎలిమెంటరీ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో శుక్రవారం విద్యార్థులకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ డీపీఎస్ రమాదేవి, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

- రాజుపాలెం : మండలంలో శుక్రవారం 96 శాతం మంది పిల్లలతో నులిపురుగుల మాత్రలు మింగించినట్లు వైద్యులు కృష్ణకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున శర్మ, పర్యవేక్షకులు జీవన్ తదితరులు ఉన్నారు.
- పెదకూరపాడు : మండలంలోని 97 కేంద్రాల్లో 8,929 మంది పిల్లలకు ఆల్ బెండా జోల్ మాత్రలను మింగించటం జరిగిందని 75 తాళ్ళూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెలుగొండారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంఈవో సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు సారెకుక్క విజయకుమార్, కంచర్ల దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- మాచవరం, ఫిబ్రవరి 9: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు వారి గ్రామాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులను పంపిణీ చేశారు.
- బెల్లంకొండ ఫిబ్రవరి 9 : మండలంలోని చంద్రాజుపాలెం ఎస్సీ కాలనీలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో నులి పురుగుల మాత్రలు పంపిణీ చేసినట్టు చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యులు కేవీ కోటేశ్వరరావు అన్నారు.



బీరవల్లిపాయ గ్రామంలో మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకు రెండు కళ్ళులాంటివి

- టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి 9 : నిరుద్యోగాన్ని నిర్మూలించాలన్నా, యువతకు ఉపాధి కల్పన లభించాలన్న రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు విజయం సాధించి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కావాలని ఆ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కోరారు. మండలంలోని బీరవల్లిపాయలో శుక్రవారం కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. కన్నా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబునాయుడుకు రెండు కళ్ళు లాంటివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పల్ల పాటి పెద్దిరాజు, జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, తెలుగు మహిళా అధయక్షురాలు నెల్లూరి అహల్యా రాణి, జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, మాజీ ఎంపీపీ లు గుత్తా వెంకట్రావు, నర్రా బాబురావు, పార్లమెంటు కమిటీ కార్యదర్శి అంకాళ్ల ప్రభుదాసు, మాజీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి పి.శ్రీను, మాజీ సర్పంచ్‌లు వాసా వెంకటేశ్వర్లు, దుద్దు అప్పారావు, ఎన్.సాంబశివరావు, గడేషు వెంకట్రావు, కణదం వెంకట్రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ అల్లాబక్షు, కోటిరెడ్డి, బ్రహ్మయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ లంకా వీరయ్య ఉన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 9 : రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావటం లేదని, రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతుందని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ హక్కుల యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు కోర్టు ఆవరణ వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి నాల్గవ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించిన కన్నా మాట్లాడుతూ టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. దీక్షా శిబిరంలో న్యాయవాదులు చిలుకా చంద్రశేఖర్, దుగ్గినేని బాపయ్య చౌదరి, అనుమోలు జయరామ్, బొక్కా సంగీతరావు, పూజల వెంకట కోటయ్య, ఉల్లం మధు, దేవినేని దస్తగిరిరావు, దివ్వెల శ్రీనివాసరావు, బత్తుల ఆదినారాయణ, చల్లా వెంకటేశ్వరరావు, పగడాల వర్మ, గంగూరి అజయ్ కుమార్, జాని ఖా జావలి, సీతయ్య, కూచిపూడి పూర్ణ, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 9 : శాలి వాహనుల అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో గల తన కార్యాలయంలో శుక్రవారం టీడీపీ శాలివాహన సాధికార కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే శాలి వాహనుల సంక్షేమానికి చేయూతనిస్తామన్నారు. సమావేశంలో శాలివాహన సాధికార కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగా శాలి వాహన నేతలు కన్నాను ఘనంగా సన్మానించారు.

ఆర్థిక సంస్కరణల ధీశాలి పీవీ నరసింహారావు

పెదకూరపాడు, ఫిబ్రవరి 9 : ఆర్థిక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ధీశాలి పీవీ నరసింహారావు లాంటి గొప్ప వ్యక్తికి అత్యున్నత పురస్కారమైన భారతరత్న దక్కటం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీవీ హయాంలో ఆర్థికాభివృద్ధి కొత్త పుంతలు తొక్కిందన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

- సత్తెనపల్లి, ఫిబ్రవరి 9 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న బిరుదును ప్రకటించటం అత్యంత ఆనందదాయకమని బ్రాహ్మణ ఐక్య వేదిక సత్తెనపల్లి డివిజన్ నాయకులు అన్నారు. శుక్రవారం రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, పెద్దింటి ఫణికృష్ణ, కొడవటికంటి నాగ పార్వతయ్య, రాజశేఖర్, బెల్లంకొండ నరసింహారావు, గుండవరపు అమరనాథ్, విజయ రామారావు, కోనంకి మారుతి, రామకృష్ణ పాల్గొన్నారు.
- క్రోసూరు, ఫిబ్రవరి 9 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు వరించటం తెలుగు వారందరికీ గర్వకారణమని రాష్ట్ర బ్రాహ్మణ ఐక్య వేదిక అధికార ప్రతినిధి కోనంకి మారుతీ అన్నారు. క్రోసూరులో పీవీ చిత్రపటానికి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పూల దండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్య వేదిక, పురోహిత సంఘం, అర్చక సంఘం నాయకులు మేడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి, వెలమకంటి నాగార్జున శర్మ, వేణు ప్రసాదు, కామేశ్వరరావు, రొంపిచర్ల రామచంద్ర ప్రసాదు, పుల్లాభట్ల శ్రీనివాస శర్మ, రొంపిచర్ల వాసుదేవమూర్తి, కేదారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- దాచేపల్లి, ఫిబ్రవరి 9: దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావుకు భారతరత్న అవార్డును ప్రకటించడంపై దాచేపల్లి బ్రాహ్మణ సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. శుక్రవారం దాచేపల్లి మండల బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ పివి నరసింహారావు చేపట్టిన సంస్కరణలతోనే నేడు భారతదేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి వెంకట హనుమంతరావు, దుగ్గరాజు కేశవరావు, దుగ్గరాజు మట్టపల్లిరావు, జానపాడు సీతారామశాస్త్రి, హరిబ్రాల ధనుంజయశాస్త్రి, తంగెడ నాగేశ్వరరావు, బెహరా వెంకట శ్రీనివాసరావు, దుగ్గరాజు హనుమంతరావు, తెంగడ వీరేశ్వరరావు, దేశిరాజు ప్రసాదరావు, పల్లి కిషోర్, తదితరులున్నారు.
- బెల్లంకొండ ఫిబ్రవరి 9 : మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వటం గర్వకారణమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, పీఎస్‌కే రసూల్, ఎన్ పిచ్చయ్య, సయ్యద్ జబ్బార్ తదితరులు ఉన్నారు.

రీసర్వేను వేగవంతం చేయాలి : ఆర్డీవో



లంకెలకూరపాడులో రీసర్వే రాళ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 3 : రీ సర్వేను వేగవంతం చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీ కృష్ణ అన్నారు. మండంలంలోని లంకెలకూరపాడులో భూరక్ష కార్యక్రమంలో భాగంగా రీసర్వే చేసిన పొలాలలో వేసిన రాళ్లను డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ విజయకుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలు, రీసర్వేపై రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీప్రసాద్, ఆర్ఐలు కపిల్‌దేవ్, పవన్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీకాంత్ ఉన్నారు.

రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలి : జనసేన

నకరికల్లు ఫిబ్రవరి 9 : రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలని, జనసేన-టీడీపీ కూటమి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టాలని సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బొర్రా వెంకట అప్పారావు ఆకాంక్షించారు. జనసేన, టీడీపీ కూటమి రానున్న ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ చేపట్టిన యాగం శుక్రవారంతో ముగిసింది. సెంట్రల్ ఆంధ్రా కో-కన్వీనర్ గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకు జనసేన పార్టీకి ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జిలానీ, కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, కటకం అంకారావు, ఎం.శ్రీనివాసరావు, ఖాశిం సైదా, రంగిశెట్టి సుమన్, సోమిశెట్టి వెంకటేశ్వ ర్లు, తాడువాయి లక్ష్మి, నాదెండ్ల నాగేశ్వరరావు, శిరిగిరి పవన్ కుమార్, మిరియాల సుబ్బమ్మ, శివలీల, నిర్మల, శ్రావణి, పద్మావతి, బెల్లంకొండ అనీల్, తోట నరసయ్య, శివ, షేక్ రఫీ, రుద్రజడ ఆంజనేయులు, పసుపులేటి వెంకటేశ్వర్లు, నామాల పుష్ప, గట్టు శ్రీదేవి, మిద్దెం మహాలక్ష్మి పాల్గొన్నారు. ఈ యాగానికి హాజరైన వారందరికీ అన్నదానం చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అక్రమంగా డివైడర్ తొలగింపు



పల్నాడు రోడ్డులో తొలగించిన డివైడర్

నరసరావుపేట, ఫిబ్రవరి 9: పట్టణంలోని పల్నాడు రోడ్డులో అక్రమంగా డివైడర్ తొలగించారు. మొక్కలు తొలగించి డివైడర్‌ను ధ్వంసం చేశారు. దీనిలోని మట్టిని కూడా తరలించుకుపోయారు. రాత్రికి రాత్రే అధికార పార్టీకి చెందిన వారే ఈ డివైడర్ తొలగించారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వసంచేస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుండటంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డివైడర్ ధ్వంసం చేయడంపై మునిసిపల్ కమిషనర్ రామ్మోహనరావును శుక్రవారం వివరణ అడగ్గా డివైడర్ తొలగింపుపై ఎంక్వయిరీ చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించినట్టు చెప్పారు.



మెగా డీఎస్సీ ఇవ్వాలని గాంధీపార్కు వద్ద ఆందోళన చేస్తున్న నిరుద్యోగ యువకులు, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

దగా డీఎస్సీతో వైసీపీ ప్రభుత్వం మోసం

● డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 9: వైసీపీ ప్రభుత్వం అదుగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అని చెప్పి చివరికి నిరుద్యోగులను నయవంచన చేసిందని, దగా డీఎస్సీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జీ రామన్న అన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గాంధీ పార్కువద్ద నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీ రామన్న మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో తొమ్మిది వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, జూన్‌నాటికి ఆరువేల పైగా పదవీ విరమణ చేస్తున్నారని, ఈ లెక్కలన్నీ వెరసి దాదాపు 25టీచరు పోస్టులు ఖాళీలు ఉంటున్నాయన్నారు. ఖాళీలతో సంబంధం లేకుండా 6100 పోస్టులు ఇవ్వడం, ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఎస్‌జీటీలోగాని, ఎస్ఏ గాని తక్కువ పోస్టులు ఇచ్చారన్నారు. వీటన్నింటిని రాష్ట్రప్రభుత్వం సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మెగా డీఎస్సీ ఇస్తేనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. పది లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే 25వేల మెగా డీఎస్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో అప్రెంటీస్ విధానం రద్దుచేయాలన్నారు. షెడ్యూల్ సమయం కూడా అన్యాయంగా ఉందన్నారు. టెట్‌కి, డీఎస్సీకి కన్ఫ్యూజన్‌గా పెట్టారని, కేవలం ఫీజులకోసం పెట్టినట్టుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ మార్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, ఎస్ఎఫ్ఐ నాయకుడు కోట సాయికుమార్, నిరుద్యోగులు పాల్గొన్నారు.



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి

పల్నాడు జిల్లా నేర సమీక్షా సమావేశం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 9: పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గించాలన్నారు. పోలీసు స్టేషన్‌లను ఆశ్రయించే బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమస్యలను ఓపిగ్గా విని బాధితులకు న్యాయం దొరుకుతుందనే నమ్మకం కలిగించాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులు అందిన వెంటనే ప్రతిస్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీసు అధికారిగాని, సిబ్బందిగాని ఉండేటట్టు చూసుకోవాలన్నారు. స్పందన ఫిర్యాదులను, పోక్సో కేసులు, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఆస్తి కేసులు, మిస్సింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా గతంలో పల్నాడు జిల్లాలో పనిచేసి ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా నుంచి బదిలీ అయిన డీఎస్పీలు మహేష్, ఆదినారాయణ, రవిచంద్ర, చిన్నికృష్ణ, సీఐలు భక్తవత్సలరెడ్డి, సీతారామయ్య, కృష్ణయ్య, షమీ ఉల్లాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు, డీఎస్పీ షర్‌ఫుద్దీన్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డీపీవో అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 9: పట్టణంలో శుక్రవారం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వై రవిశంకర్ రెడ్డి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలన్నారు. లేకుంటే వందలమంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. విద్యార్థులు హెల్మెట్ ధారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు, జిల్లాలోని డీఎస్పీలు, జిల్లా రవాణా అధికారి పరంధామరెడ్డి, ఎంవీ ఐలు, సత్యనారాయణ ప్రసాదు, శ్రావ్య, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసులు, ఆర్టీవో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 9: నరసరావుపేట పట్టణంలో శుక్రవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్టు సంబంధిత అధికారులు కే సూర్య ప్రకాష్, శ్రీనివాసరావులు తెలిపారు. ఈ తనిఖీల్లో 39మంది అధికారులు, 117మంది సిబ్బంది, 39బృందాలుగా ఏర్పడి 2230 సర్వీసులను తనిఖీ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 163మందికి రూ.7.93 లక్షలు అపరాధ రుసుం విధించారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టంకు లోబడి ఉంటాయన్నారు. వినియోగ దారులందరూ వారి ఇంటి ఆవరణలో ఉండే విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేటట్టు నిర్ధారించుకోవాలన్నారు. సీలులేకపోయినా, తుప్పుపట్టి ఊడిపోయినా వెంటనే సంబంధిత సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రవికుమార్, ఏడుకొండలు, కోటేశ్వరరావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారిని కలిసిన ఎస్టీయూ నాయకులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 9: పల్నాడు జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వెంటేశ్వర్లును కార్యాలయంలో ఎస్టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఈవో ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాలల బలోపేతం విద్యార్థుల నమోదు, ఉత్తీర్ణతలో పరస్పర సహకారంతో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమిష్టి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రజిత్‌యాదవ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కే కోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎం సుభాని, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 9: స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వెట్టి చాకిరి నిర్మూలనపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక వెట్టి చాకిరి నిర్మూలనపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బ్లెసీనా, మునిసిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో మట్టి తరలింపు

● వైసీపీ నాయకుల నిర్వాకం
● మూడు రోజులుగా జరుగుతున్నా చర్యలు శూన్యం
● మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు



చెక్కవాగు సమీపంలో మూడు రోజులుగా మట్టి తరలింపుతో గుంతలమయంగా మారిన ప్రభుత్వ భూమి, అరుంధతి కాలనీ సమీపంలోని భూముల్లో చదును చేస్తున్న చెక్కవాగు మట్టి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 9: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. భూములను కబ్జా చేయడం ఒక ఎత్తు అయితే ఆ భూమిలో మట్టిని తరలించి లక్షల రూపాయలను కూడకట్టుకుంటున్నారు. మట్టికి మంచి డిమాండ్ ఉండటంతో పట్టణంలోని విఠంరాజుపల్లి పంచాయతీలోని చెక్కవాగు సమీపంలోని ప్రభుత్వ భూములు మట్టిని తరలించి చేపల చెరువులుగా ఏర్పాటు చేస్తున్నారు. గురువారం రాత్రి చెక్కవాగు సమీపంలో ప్రభుత్వ భూమిలో గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో మట్టిని తరలించి బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని అరుంధతి కాలనీలో సుమారు ఐదు ఎకరాల మేర భూమిని చదును చేసేందుకు వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా రాత్రివేళల్లో ట్రాక్టర్లు టిప్పర్లు నడవడంతో ఆ ప్రాంతంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా లక్షల రూపాయల విలువ చేసే మట్టిని తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ, ఎస్ఈబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా చెక్కవాగు సమీపంలోని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించి అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ పి.బ్రహ్మయ్యను వివరణ కోరగా కొత్తగా విధుల్లో చేరానని, వీఆర్వోల సాయంతో విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

బీసీలకు ఏం చేశారని.. ఓటు వేయాలి జగన్

జయహో బీసీ సదస్సులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 9: వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో బీసీలకు ఏం చేశారని ఆ వర్గాలు మళ్ళీ జగన్‌కు ఓటు వేయాలని? మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాసెస్ కాదు, బ్యాక్ బోన్ వర్గాలంటూ వారి వెన్ను విరిచినందుకా?, 30కి పైగా బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేసి నందుకా?, 74మంది బీసీ నాయకులను క్రూరంగా చంపి నందుకా?, ఐదువేలమంది బీసీలపై దాడులు, అక్రమ కేసులు పెట్టినందుకా?, వారు వైసీపీకి ఎందుకు ఓటు వేయాలో ఒక్క కారణం చెప్పగలరా? అని ఆయన ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మగౌరవంతో పాటు అన్నింటా అవకాశాలతో తలెత్తుకొని బతికిన వెనుకబడిన వర్గాల వారిని అన్ని విధాలా మోసంచేసి రోడ్డున పడవేసిన దుర్మార్గుడు సీఎం జగన్ అని ప్రత్తిపాటి దుయ్యబట్టారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జయహో బీసీ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీఆర్, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించారని, టీడీపీ అధికారంలోకి వచ్చినా 1983 తరువాతే బీసీలకు నిజమైన స్వాతంత్రం వచ్చిందని, అధిక జనాభా కలిగిన బీసీలకు టీడీపీ రాజకీయ ప్రాధాన్యం, ఆర్థిక వెసులుబాటు కల్పించిందన్నారు. అలాంటి పరిస్థితుల నుంచి గడిచిన ఐదు సంవత్సరాలలో 56 బీసీ కార్పొరేషన్‌లు అంటూ ప్రచార ఆర్భాటం చేసిన వైసీపీ ప్రభుత్వం వారికి పైసా విదిలించకపోగా బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.75కోట్లు దారి మళ్ళించటం వారి కుటిల నీతికి నిదర్శనం అన్నారు. ఇప్పుడు టిక్కెట్ల కేటాయింపులో కూడా జగన్ అత్యధికంగా అన్యాయం చేస్తుంది బీసీలకేనని ప్రత్తిపాటి విమర్శించారు.

అందుకే రాష్ట్రవ్యాప్తంగా బీసీలంతా ఈ సారి తమ రాజకీయ అవకాశాల పుట్టినిల్లు తెలగుదేశం పార్టీతో కలసి నడవాలనే కృతనిశ్చయంతో ఉన్నారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారు

● టీడీపీ జిల్లా అధికారప్రతినిధి జగ్గారావు

ఈపూరు, ఫిబ్రవరి 9: ఎన్నికల్లో ఓటమి చెందుతామనే భయంతో వైసీపీ నాయకులు టీడీపీ సానుభూతిపరుల ఓట్లను అన్యాయంగా తొలగిస్తున్నారని పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. మండల టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం తహసీల్దారు బీ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ ఫారం7 దరఖాస్తుచేసి గంపగుత్తగా ఓట్లను తొలగిస్తున్నారన్నారు. బీల్వోలు కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయకుండా ఓట్లు తొలగిస్తున్నారన్నారు. వైసీపీ వాళ్ళకు రెండేసి ఓట్లు ఉన్నా తొలగించడంలేదన్నారు. ఎంత ప్రయాసపడినా వైసీపీకి ఓటమి తప్పదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, గన్నమనేని వెంకయ్య, బెల్లంకొండ సైదులు, ఐనాల కోటేశ్వరరావు, కాటం కోటేశ్వరరావు, గోనుగుంట్ల శ్రీనివాసరావు, నందిగం అక్కారావు, బొల్లా సుబ్బారావు, గోపు వీరాంజనేయులు, గడిపూడి వేణు, దండే కోటేశ్వరరావు, మద్దం రామలక్ష్మయ్య, బ్రహ్మంలు ఉన్నారు.

తంగేడుమల్లి మేజరు వద్ద కల్లాల్లో మిర్చి చోరీ

● రైతుకు రూ.రెండు లక్షలు నష్టం

రొంపిచర్ల, ఫిబ్రవరి 9: మండల కేంద్రమైన రొంపిచర్ల నుంచి సుబ్బయ్యపాలెం వెళ్లే రహదారిలో తంగేడుమల్లి మేజరు వద్ద శుక్రవారం తెల్లవారు జామున కల్లాలోని మిర్చి చోరీకి గురైంది. వివరాల్లోకి వెళితే రొంపిచర్లకు చెందిన గొట్టం శివారెడ్డి గ్రామంలో నాలుగు ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. మిర్చి పంట కోసిన తరువాత కాయలను వేరు చేసి కల్లంలో ఆరబోశాడు. యథావిధిగా సాయంత్రం 7గంటల వరకు మిర్చి కల్లం వద్ద కాపలా ఉన్నాడు. అనంతరం ఇంటికి వచ్చి ఉదయం పూట వెళ్ళే సరికి సుమారు 25 టిక్కీల మిరపకాయలు చోరీకి గురైనట్టు గుర్తించి అవాక్కయ్యాడు. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నష్టపోయిన మిర్చి విలువ రూ.2లక్షలు మేర ఉంటుందని శివారెడ్డి తెలిపాడు. కౌలుకు తీసుకొని పొలం సాగుచేయటంతో లబోదిబోమంటున్నాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. శివారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తరచూ మోడల్ పాఠశాలకు బస్సులు నిలిపివేత

రొంపిచర్ల, ఫిబ్రవరి 9: మండలంలోని ఏపీ మోడల్ పాఠశాలకు తరచూ ఆర్టీసీ సర్వీసులను నిలిపివేస్తున్నారు. శుక్రవారం కూడా బస్సులను నిలిపివేయటంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈపూరు, రొంపిచర్ల మండలాల విద్యార్థులు ఈ పాఠశాలకు వెళ్తుంటారు. గోగులపాడు నుంచి ఒక సర్వీసు, ఆరేపల్లి ముప్పాళ్ళ నుంచి ఒక సర్వీసు ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తుంటాయి. తరచూ ఉదయం 9 గంటల వరకు వేచిచూసి వెనుదిరిగి వెళ్తున్నారు. ముందుగా సమాచారం కూడా ఇవ్వటం లేదు. దీంతో పాటు నరసరావుపేట - ఏ ముప్పాళ్ళ రహదారిలో కూడా పర్వదినాలు, సెలవు రోజుల్లో ఒక సర్వీసు మాత్రమే నడుస్తుంది. కాగా ఈ విషయంపై ఆర్టీసీ డీఎంను వివరణ కోరటానికి ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

నేడు లయోలా పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని లయోలా ఉన్నత పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గుంటూరు బిషప్ రెవ.చిన్నాబత్తిని భాగ్యయ్యతో పాటు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీఈవో శామ్యూల్, డిప్యూటీ డీఈవో వేణుగోపాల్ తదితరులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. 1971లో పాఠశాలను స్థాపించి నేడు గోల్డెన్ జూబ్లీ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

లబ్ధిదారులకే నేరుగా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, ఫిబ్రవరి 9: సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం రాత్రి పర్యటించారు. సంక్షేమం పేద ప్రజలకు చేరవేయటం కోసం సచివాలయాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. అవినీతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రూ.40లక్షల వ్యయంతో సచివాలయం, రూ.40లక్షల వ్యయంతో ధాన్యం గోదాములను ప్రారంభించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.2.7కోట్ల మేర నిధులతో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలో రూ.26కోట్ల మేర అభివృద్ధి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



నులి పురుగుల మాత్రలు వేస్తున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బీ రవి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 9: పట్టణంలోని బరంపేటలోని శ్రీ రామకృష్ణ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా సహాయ కలెక్టర్ కల్పశ్రీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను నమిలిమింగి పురుగుల నివారణకు సహకరించాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ బీ రవి మాట్లాడుతూ నులిపురుగుల దినోత్సవం యెక్క ఆవశ్యకతను వివరించారు. హ్యాండ్ వాష్ టెక్నిక్‌ను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ రాజరాజేశ్వరి, వెంకటేశ్వర్లు, గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పాఠశాలల్లో శుక్రవారం ఆల్ బెండా జోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులి పురుగుల నివారణకు ఈ మాత్రలు దోహద పడతాయని వైద్యాధికారి రేవతిబాయి తెలిపారు. 96శాతం మాత్రలు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆషా వర్కర్లు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా నులి పురుగుల మాత్రలను విద్యార్థులకు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జ్ఞానేశ్వరి, ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మీకోటిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులకు ఈ మాత్రలను మింగించారు.

సినీ గాయకుడు మనోకు సత్కారం



సినీ గాయకుడు మనోను సత్కరిస్తున్న జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ, ఫిబ్రవరి 9: సినీ గాయకుడు మనో, స్టార్ మా టీవీ సౌత్ ఇండియా హెడ్, మనో సోదరుడు బాబావలి బృందం శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకొని హైదరాబాద్ వెళ్తూ వినుకొండ, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుతో పాటు ఆయన సతీమణి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ లీలావతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, హనుమంతరావు, వెంకట్రావులతో కలిసి సింగర్ మనోను ఘనంగా సన్మానించారు. అనంతరం జీవీ మాట్లాడుతూ మనో టీవీ బృందం వినుకొండకు రావడం ఎంతో సంతోషకరమన్నారు. మనోకు ప్రఖ్యాత రిచ్‌మండ్ క్యాబ్రియల్ విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ బిరుదుతో గౌరవించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భూపతిరావు, శ్రీనివాసరావు, వెంకట్రావు, కందగడ్డ సుబ్బారావు, అచ్యుత శ్రీను, తూమాటి కాశీ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి మక్కెన పరామర్శ

వినుకొండ, ఫిబ్రవరి 9: ఇటీవల అనారోగ్యంతో చికిత్సపొందిన పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతివరప్రసాద్‌ను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం రాజకీయ పరిస్థితులపై మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంద్రపాటి సైదా, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటకల ప్రసాద్ తదితరులతో కలిసి చర్చించారు. ఆయనతో పాటు సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, రాము, నరసింహారావు, పవన్ తదితరులు పాల్గొన్నారు. చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పుట్టగుంపల నాగేశ్వరరావు పార్థివదేహానికి నివాళులర్పించారు. గాయపడి చికిత్స పొందుతున్న పుట్టగుంపల గాలెమ్మను పరామర్శించారు.

పది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 9: గంగినేని ఫౌండేషన్ చైర్మన్ గంగినేని రాఘవ ఆధ్వర్యంలో మండలంలోని చీకటీగలపాలెంలోని ఏపీ మోడల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు డీఎల్‌డీఏ లగడపాటి వెంకట్రావు చేతుల మీదుగా స్టడీమెటీరియల్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో డీసీ మాజీ చైర్మన్ సోమేపల్లి బ్రహ్మయ్య, వీరగంధం ప్రశాంత్, ఏడుకొండలు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, ఫిబ్రవరి 9: రెండో శనివారం సందర్భంగా పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని ఆ శాఖ డీఈఈ అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. నరసరావుపేట సెంటర్, పండరీపురంతో పాటు టౌన్-1 పరిధిలో హైవే ఫీడర్ పరిధిలో సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ఇవికాక చిలకలూరిపేట మండలంలోని గ్రామాలు, సాతులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, గణపవరం ప్రాంతంలోని అన్నిరకాల పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, ఫిబ్రవరి 9: మండలంలోని గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రాంబాబు శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్ళ 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు. అదేవిధంగా రైతులకు మూడో ఫేజ్ విద్యుత్ శనివారం రాత్రి 12గంటల నుంచి ఉదయం 8గంటల వరకు ఇవ్వనున్నట్టు తెలిపారు.

వినుకొండ పట్టణంలో...

వినుకొండటౌన్, ఫిబ్రవరి 9: వినుకొండ పట్టణంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10గంటల వరకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో చిన్నారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు విద్యుత్ సౌకర్యం కోసం పలుమార్లు సంప్రదించినా కనీసం స్పందన కరవు కావడంతో అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేతపై ప్రజలకు ముందస్తు సమాచారం అందజేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారి గౌస్‌ను సంప్రదించగా అందుబాటులో లేరు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని 14వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త షేక్ షబ్బీర్ ప్రమాద వశాత్తు గాయపడాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వైద్య ఖర్చుల నిమిత్తం అతనికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుల ద్వారా అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో 14వ వార్డు పార్టీ అధ్యక్షుడు బేరింగ్ కరిముల్లా, క్లస్టర్ ఇన్‌చార్జ్ ముల్లా కరిముల్లా, సయ్యద్ రఫీ, షేక్ సాయి బాబు, భారీ సైదా, షేక్ ముస్తఫా, మౌలాలి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పొలం తీసుకొని నగదు చెల్లించలేదంటూ రైతుల ఆందోళన

వేల్పూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 9: మండలంలోని వేల్పూరు ఎస్సీ కాలనీ వాసులకు నివేశన స్థలాలు పంపిణీ చేసేందుకు పూరేటి చంద్రశేఖర్, పూరేటి శ్రీకాంత్, పూరేటి హరిబాబులకు చెందిన పొలాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి 8నెలలు గడుస్తున్నా ఇంతవరకు నగదు చెల్లించలేదని బాధితులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వేల్పూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 24-7-2లో ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల వెనుక తమ ముగ్గురికీ కలపి 1.62సెంట్లు పొలం ఉండగా 2023 జూన్ 1న తమ వద్ద ఎకరా రూ.12లక్షలకు కొనుగోలు చేస్తున్నట్లు శావల్యాపురం తహసీల్దార్ కార్యాలయంలో అప్పటి తహసీల్దార్ జాన్‌సైదులు సమక్షంలో తమ ముగ్గురితో ఒప్పందపు పత్రంపై సంతకాలు పెట్టించుకొని 45రోజుల వ్యవధిలో ప్రభుత్వం తమ బ్యాంక్ ఖాతాలలో నగదు జమ చేస్తుందని చెప్పారని తెలిపారు. కానీ 8నెలలు గడుస్తున్నా నగదు జమచేయలేదని వాపోయారు. సర్పంచ్ రంతు శ్రీనివాసరావు పొలంలో పిచ్చిమొక్కలు కూడా పీకించి చదును చేయించాడని, దాంతో ఈ ఏడాది తాము పొలంలో పంటను కూడా సాగుచేయలేదని తెలిపారు. పలుమార్లు తహసీల్దార్‌ను కలసి నగదు జమచేయలేదని తెలిపామని, కలెక్టర్ కార్యాలయంలో సీ-సెక్షన్‌లోని అధికారులను కలసి విషయాన్ని తెలియజేయాలన్నా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నగదు జమచేయాలని బాధితులు కోరారు.

రీసర్వేతో భూముల అక్రమాలు బట్టబయలు

పిచికలపాలెం, ఫిబ్రవరి 9: రైతుల మధ్య భూవివాదాలకు తావులేకుండా శాశ్వత భూ హక్కును కల్పించేందుకు ప్రభుత్వం రీసర్వేని చేపడితే తీగలాగితే డొంక కదిలినట్లుగా గతంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి. మండలంలోని పిచికలపాలెంలో గాలి వెంకటేశ్వర్లుకు 8.27ఎకరాలు పొలం ఉండగా రీసర్వేలో 4.27ఎకరాలు మాత్రమే ఉన్నట్లుగా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగిలిన పొలంలో అయన తల్లి బుచ్చమ్మకి 1.36ఎకరాలు, అదే గ్రామానికి చెందిన గాలి అయ్యన్న కుమార్డు వెంకటేశ్వర్లుకు 1.92ఎకరాలు ఆన్‌లైన్ చేశారు. వారిద్దరూ పొలం తమది కాదని అధికారులకు తెలిపారు. 0.72సెంట్లు తేలాల్సి ఉండగా దానిలో 0.30సెంట్లు పోరంబోకు కలసిందని అధికారులు చెప్పగా వెంకటేశ్వర్లు అంగీకరించాడు. మరో 0.42సెంట్లు తేలాల్సి ఉండగా విచారణ చేయగా గతంలో జరిగిన అక్రమాలు బయటకు పొక్కాయి. పిచికలపాలేనికి చెందిన తుర్లపాటి సీతయ్యకు 324-సి సర్వే నంబర్‌లో 1.90ఎకరాలు పొలం ఉండగా 8ఏళ్ళ క్రితం దానిలో 1.45సెంట్లు గాలి వెంకటేశ్వర్లుకు అమ్మాడు. మరో 0.45సెంట్లు మిగిలి ఉండగా రెవెన్యూ అధికారులతో సీతయ్య కుమ్మక్కై అయన పొలం పక్కనున్న వాగు పోరంబోకు మరో ఎకరాన్ని కలుపుకొని రెవెన్యూ అధికారుల ద్వారా 1.45ఎకరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని గుట్టుచప్పుడు కాకుండా దాన్ని రెండేళ్ళ క్రితం శావల్యాపురం వ్యక్తికి అమ్మేశాడు. రీసర్వేలో శావల్యాపురం వ్యక్తికి పోరంబోకు పోను 0.45సెంట్లు మాత్రమే ఉన్నట్లు తేలింది. రెవెన్యూ అధికారులు గాలి వెంకటేశ్వర్లుకు రావలసి 0.42 సెంట్లును శావల్యాపురం వ్యక్తికి కలపి ఆన్‌లైన్ చేశారు. గాలి వెంకటేశ్వర్లు శుక్రవారం శావల్యాపురం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను కలవగా తుర్లపాటి సీతయ్య అక్రమాలకు పాల్పడ్డాడని, ఆయనపై క్రిమినల్ కేసు పెట్టి విచారణ జరిపిస్తామని తెలిపారు. ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

మురుగు నీటి కాలువ మాయం: సుబ్రహ్మణ్యం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 9: చిలకలూరిపేట-నరసరావుపేట మార్గంలో బైపాస్ రోడ్డుకు దగ్గరలో ఒక పెద్ద మురుగు కాలువ మాయమైందని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం శుక్రవారం ఆరోపించారు. కాలువ స్థలాన్ని కొందరు వ్యక్తులు పూడ్చి వేసి అక్రమించుకున్నారన్నారు. తక్షణం ఈ విషయాన్ని మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్ పరిశీలించాలని కోరారు. రికార్డుల ప్రకారం పరిశీలన జరిపి కాలువను మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో సంఘీభావం తెలియజేస్తున్న అఖిలపక్ష నాయకులు

16వ తేదీన జరిగే పారిశ్రామిక బంద్‌ను విజయవంతం చేయాలి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 9: ఈ నెల 16వ తేదీన గ్రామీణ పారిశ్రామిక బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ అన్నారు. స్థానిక శివయ్యభవన్‌లో రైతు కార్మిక సంఘాల నాయకులు, అఖిలపక్ష పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వం నిర్మిస్తే మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత నూతన సంస్థలను నిర్మించకపోగా ప్రైవేటుకు కట్టబెట్టాడన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

నాదెండ్ల, ఫిబ్రవరి 9: మండలంలోని గణపవరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన పగల సావిత్రికి శుక్రవారం రాష్ట్ర కార్మిక, రైతాంగ పరిరక్షణ సమితి వారు ఆర్థికసాయం చేశారు. సావిత్రి భర్త అనారోగ్యంతో బాధ పడుతుండగా ప్రతి నెల వైద్య ఖర్చుల కింద నెలకు రూ.3వేలును అందజేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ లెనిన్‌బాబు, శ్రీను నాయక్‌లు పాల్గొన్నారు.